


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 6 సంచిక: 24, పేజీలు - 08
ఆదివారం, జులై 19, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## ఆహార, ఔషధాల కల్తీల నిరోధానికి కఠిన చట్టం

### క్యూర్‌లో పైలెట్ ప్రాజెక్ట్ సీఎం రేవంత్ రెడ్డి





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్‌తో పాటు కల్తీ ఆహారంపై ఉక్కుపాదం మోపుతోంది. ఆహారం, ఔషధాల కల్తీలను అరికట్టేందుకు అత్యంత కఠినమైన చట్టాన్ని రూపొందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు వంటి నిత్యావసర వస్తువులు కూడా కల్తీ బారిన పడుతుండటంతో ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంసీహెచ్‌ఆర్డీ లో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో 'తెలంగాణ ఆహార కల్తీ, ఔషధ నియంత్రణ చట్టం' పై సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.

**ఆర్గానిక్ ఉత్పత్తుల పేరుతో అధిక ధరలు..**

ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువ రోజులు నిల్వ ఉండటానికి, పండ్లు త్వరగా పండటానికి ఎలా పడితే అలా కెమికల్స్ వాడుతున్నారని, అలాగే ఎరువులు, పురుగుమందుల మితిమీరిన వాడకం వల్ల పంటల్లో రసాయనిక అవశేషాలు ఉండిపోవడంతో విదేశాలు మన వద్ద పండిన ఉత్పత్తుల దిగుమతిని నిరాకరిస్తున్న విషయాన్ని సీఎం రేవంత్ ప్రస్తావించారు. మార్కెట్లో ఆర్గానిక్ ఉత్పత్తుల పేరుతో అధిక ధరలకు అమ్ముతున్నా,

2లో..

### మన విద్యా విధానాన్ని సమూలంగా
## ప్రక్షాళన చేయాలి

### తల్లిదండ్రుల త్యాగానికి తగిన ఫలితం దక్కేలా ఉండాలన్న రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశంలో వరుసగా జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకేజీలు అనేక కుటుంబాలను తీవ్ర విషాదంలోకి నెట్టాయని, విద్యార్థులకు భద్రత, తల్లిదండ్రులకు న్యాయం జరిగేలా పరీక్షల వ్యవస్థను పూర్తిగా పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. నీట్ పేపర్ లీక్ వివాదం అనంతరం బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థిని రియా తండ్రి రాజేశ్‌తో డెహ్రాడూన్‌లో జరిగిన భేటీ తనను తీవ్రంగా కలిచివేసిందని చెప్పారు. ఈ ఘటన ఒక్క కుటుంబానిదే కాదని, దేశవ్యాప్తంగా వేలాది కుటుంబాలు ఇలాంటి బాధను అనుభవిస్తున్నాయని ఎక్స్ వేదికగా చేసిన పోస్టులో పేర్కొన్నారు.

**రియా తండ్రి విజ్ఞప్తి**

శుక్రవారం డెహ్రాడూన్‌లో నిర్వహించిన 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమంలో



రాహుల్ గాంధీ విద్యార్థిని రియా తండ్రి రాజేశ్‌ను కలిసి మాట్లాడారు. బన్నూ పాఠశాల మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో తన కుమార్తె మరణాన్ని గుర్తుచేసుకుంటూ రాజేశ్ భావోద్వేగానికి గురయ్యారు. "మే 3న

2లో..

### ఇప్పటి వరకు ఒక లెక్క..
## ఇక నుంచి మరో లెక్క

### - సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్

- ఉద్యోగాలపై కాంగ్రెస్‌ను నిలదీసిన కేటీఆర్
- 70 వేల ఉద్యోగాలపై బహిరంగ సవాల్
- నోటిఫికేషన్లు కాదు.. లూటిఫికేషన్ జరుగుతోందని విమర్శ
- హామీలు నెరవేర్చకపోతే యువతే తీర్పు చెబుతుందన్న వ్యాఖ్య

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** యువతకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శిస్తూ హైదరాబాద్ శివారులోని సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ సభ ఏర్పాటు చేసింది. యువ సంగ్రామ సదస్సు పేరుతో నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని, ఇకపై గతంలో చేసిన తప్పులు పునరావృతం కావని చెప్పుకొచ్చారు. నిరుద్యోగుల బాధ్యత తానే తీసుకుంటానని కూడా వెల్లడించారు. తెలంగాణ వచ్చిన తర్వాత చాలా జాగ్రత్తగా రాష్ట్రాన్ని పాలించామన్నారు కేటీఆర్. ఈ క్రమంలో చాలా తప్పులు జరిగాయని ఒప్పుకున్నారు. ఈసారి అలాంటి పరిస్థితి రాకుండా చూస్తామన్నారు.

2లో..



### చరిత్ర సృష్టించిన
## భారత్

### - నిప్పులు చిమ్ముతూ నింగిలోకి 'విక్రమ్-1'



**శ్రీహరికోట (ప్రశ్న న్యూస్)** భారతదేశ అంతరిక్ష యవనికపై భారత సరికొత్త ప్రైవేట్ శకం అధికారికంగా ప్రారంభమైంది. చివరి నిమిషంలో ఊపిరి బిగబట్టేలా చేసిన ఉత్కంఠకు

2లో..

## 2024లో రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారు



- రాష్ట్రవ్యాప్తంగా రూ.15,274 కోట్ల పట్టణాభివృద్ధి పనులకు గుడివాడ నుంచి శ్రీకారం
- బూతులు తిట్టిన వారి నోళ్లను ప్రజలు తమ ఓట్లతో కడిగేశారన్న చంద్రబాబు
- అక్టోబర్ 2 నాటికి ఏపీని చెత్త రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటన
- భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో అసభ్య పోస్టులను సహించేది లేదని హెచ్చరిక

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉమ్మడి కృష్ణా జిల్లాలోని కీలక నియోజకవర్గమైన గుడివాడ వేదికగా విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణపై రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రౌడీయిజం, ఫ్యాక్షనిజం చేస్తే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు అని సీఎం కరాఖండిగా హెచ్చరించారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనను గొడ్డలి పార్టీ రాజకీయంగా అభివర్ణించిన చంద్రబాబు, కొందరు నేతలు క్రిమినల్స్‌గా మారి ప్రజల జీవితాలతో ఆడుకున్నారని, మాజీ మంత్రి కొడుకు చేసిన కారు ప్రమాదంలో ఒక ప్రాణం పోయినా అప్పటి ప్రభుత్వం స్పందించిన తీరే అందుకు నిదర్శనమని ధ్వజమెత్తారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఇలాంటి దారుణమైన దోపిడీ, అరాచక రాజకీయాలను ఎప్పుడూ చూడలేదన్నారు. గత ఎన్నికల్లో కొంత మంది నేతల నోర్లను ఫినాయిల్ వేసి క్లీన్ చేశారని

2లో..



### ఇదేనా మహిళల భద్రతా.?
## ఇదేనా మీ సుపరిపాలన.?

- గుంటూరులో మహిళపై టీడీపీ నేత దాడి ఘటనపై జగన్ ఆగ్రహం
- ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదని తీవ్ర విమర్శలు
- ఇదేనా సుపరిపాలన, మహిళా భద్రత అంటూ సర్కారుకు ప్రశ్నలు
- మహిళల ఆగ్రహం ప్రభుత్వానికి బుద్ధి చెబుతుందని హెచ్చరిక

అమరావతి (ప్రశ్న న్యూస్) గుంటూరులో ఒక మహిళను వివస్త్రను చేసి, టీడీపీ నాయకుడు దాడికి పాల్పడిన ఘటన మానవత్వానికే మచ్చ అని, రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణ ఎంత ఘోరంగా విఫలమైందో చెప్పడానికి ఇది నిలువెత్తు నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు.

2లో..



### తెలంగాణ బీజేపీలో
## కీలక పరిణామం!

- బండి, ఈటల మధ్య సయోధ్య చర్చలు
- ఎంపీ లక్ష్మణ్ నివాసంలో కీలక భేటీ
- ఒక కుటుంబ పార్టీగా మేం మాట్లాడుకున్నామన్న ఎంపీ లక్ష్మణ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో అధికారంలోకి రావాలని చాలా కృతనిశ్చయంతో ఉన్న బీజేపీ దిద్దుబాటు చర్యలకు దిగింది. ఇప్పటికే వేరే పార్టీల నుంచి నేతలను ఆహ్వానించాలని చెప్పిన హైకమాండ్, నేతల మధ్య విభేదాలపై దృష్టి పెట్టింది. ముఖ్యంగా

2లో..

## పోలీసులపై కారం చల్లి, కుర్చీలు విసిరి

- బహదూర్‌గూడలో హైటెన్షన్ - బుల్లెట్ రైల్ ప్రాజెక్ట్ భూసేరణ రణరంగం
- కానిస్టేబుళ్లు సహా పలువు పోలీసులకు గాయాలు
- 600 ఎకరాల భూముల స్వాధీనానికి వ్యతిరేకత
- ఐదు రోజులుగా రైతుల ఆందోళన కొనసాగింపు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో మరోసారి ఉద్రిక్తత చోటుచేసుకుంది. బుల్లెట్ ట్రైన్ హబ్ కోసం భూసేకరణకు భూములు ఇచ్చేది లేదంటూ రైతులు నిరసనకు దిగారు. సాగు చేసుకుంటున్న భూములు ఎవరికి ఇచ్చేది లేదని రైతులు స్పష్టం చేశారు. ఈ క్రమంలో కొందరు నిరసనకారులు పోలీసులపైకి

2లో..

### నేనున్నంత వరకు
## బీఆర్ఎస్ సర్కారు రానివ్వను

- ఘట్‌కేసర్‌లో అందెశ్రీ స్మృతివనానికి భూమిపూజ
- అందెశ్రీ ఒక ఆత్మబంధువు అని కొనియాడిన సీఎం రేవంత్ రెడ్డి
- కేసీఆర్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు
- ఏడాదిలోనే 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని వెల్లడి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేసీఆర్ కుటుంబం వందలాది ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు నిర్మించుకుందని, వారు నిజాం రాజును మించిన ధనవంతులుగా ఎదిగారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రముఖ కవి, గాయకుడు, తెలంగాణ

2లో..



## యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు

- వ్యాపారులపై భారం, వినియోగంపై ప్రభావం?

2లో..

UNIFIED PAYMENTS INTERFACE

## 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలు

- ఉత్తమ నటులుగా మమ్ముట్టి, కార్తీక్ ఆర్యన్.. ఉత్తమ నటిగా యామి గౌతమ్
- తెలుగులో పలు విభాగాల్లో సత్తా చాటిన 'పుష్ప 2', 'ఖల్కి', 'కమిటీ కుర్రోళ్లు'
- ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌గా 'ఆర్టికల్ 370', ఉత్తమ వినోదాత్మక చిత్రంగా 'ఖల్కి'
- ఉత్తమ దర్శకుడిగా 'అమరన్' చిత్రానికి రాజ్ కుమార్ పెరియసామి

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారతీయ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రకటించింది. 2024 సంవత్సరానికి గాను జనవరి 1 నుంచి డిసెంబర్ 31 మధ్య సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రాలకు ఈ అవార్డులను అందించనున్నారు.

3లో..



## ఆహార, ఔషధాల కల్తీల నిరోధానికి కఠిన చట్టం

వాటి నాణ్యతను నిర్ధారించడానికి సరైన వ్యవస్థలు లేవు అన్నారు.

### ఆహారం కల్తీపై కఠిన చట్టాల రూపకల్పనకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం

ఆహారం, ఇతర పదార్థాల కల్తీల నిరోధానికి కఠినమైన చట్టాలు అమలు చేస్తున్న దేశాలను సందర్శించి, అక్కడి విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదికను తయారు చేయాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఆ నివేదిక ఆధారంగా బిల్లును రూపొందించి, అసెంబ్లీలో సమగ్రమైన చర్చ చేపడతామని, అలాగే ప్రజల నుంచి కూడా అభిప్రాయాలను సేకరిస్తామని తెలిపారు. కల్తీలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించేందుకు ప్రత్యేకంగా 'విజిల్ బ్లోయర్ల'ను నియమించడంతో పాటు, ప్రజల కోసం ఒక టోల్ ఫ్రీ నెంబర్‌ను కూడా ఏర్పాటు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

### క్యూర్ పరిధిలో పైలెట్ ప్రాజెక్టుకు చేపట్టాలని సీఎం రేవంత్ యోచన

కల్తీల నిరోధక నిబంధనలను పూర్తి స్థాయిలో అమలు చేయడానికి ముందుగా క్యూర్ (క్యూర్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడ నిబంధనలు అమలు చేసినప్పుడు వచ్చే లోటుపాట్లను గమనించి, వాటి ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా చట్టాన్ని అమలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆహారం, మెడిసిన్ కల్తీలపై తీసుకోవాల్సిన చర్యలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సి.వి. ఆనంద్, సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు వి. శేషాద్రి, ఎన్. శ్రీధర్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మన విద్యా విధానాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాలి

నా కుమార్తె పరీక్ష రాసి చాలా సంతోషంగా ఇంటికి వచ్చింది. పరీక్ష బాగా జరిగిందని చెప్పింది. కొద్దిసేపటికే ప్రశ్నాపత్రం లీక్ అయిందనే వార్తను తన మొబైల్‌లో చూపించింది. మొదట నేను ఆ వార్తను నమ్మలేదు. కానీ ప్రశ్నాపత్రం నిజంగానే లీక్ అయిందని ఆమె చెప్పింది" అని రాజేశ్ వివరించారు. తన కుమార్తెకు జరిగిన అన్యాయం మరో విద్యార్థికి జరగకూడదని, ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తి దేశవ్యాప్తంగా చర్చ జరిగేలా చూడాలని రాహుల్ గాంధీని కోరారు. "నా కుమార్తె లేకుండా నేను జీవించలేను. కానీ మరే తల్లిదండ్రి కూడా నా పరిస్థితిని ఎదుర్కోకూడదు" అంటూ ఆయన కన్నీటి పర్యంతమయ్యారు.

### 7.5 కోట్ల మంది యువత నష్టపోయారు

దేశంలో పరీక్షల నిర్వహణలో చోటుచేసుకుంటున్న అవకతవకలు, పేపర్ లీక్‌లు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ జూన్ 17న రాజస్థాన్‌లోని కోటా నుంచి 'ఛాత్రోన్ కీ గూంజ్' ప్రచారాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా రాహుల్ గాంధీ వివిధ రాష్ట్రాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశమవుతూ వారి అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. డెహ్రాడూన్ సమావేశంలో మాట్లాడిన రాహుల్ గాంధీ, గత పదేళ్లలో ప్రశ్నాపత్రాల లీకేజీల వల్ల సుమారు 7.5 కోట్ల మంది యువత నష్టపోయారని ఆరోపించారు. ఈ సమస్యను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

### టెలిగ్రామ్, సిగ్నల్‌లో పేపర్లు దొరుకుతున్నాయి

దేశంలో పరీక్షా పత్రాల లీకేజీకి అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. "మీ దగ్గర డబ్బు ఉంటే పరీక్షా పత్రాలు ఇంటర్నెట్‌లో, టెలిగ్రామ్, సిగ్నల్ వంటి ప్లాట్‌ఫారమ్‌లలో సులభంగా లభిస్తున్నాయి. ఇది భారత విద్యా వ్యవస్థ దుస్థితికి నిదర్శనం" అని వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా 152 ప్రశ్నాపత్రాల లీక్ ఘటనలు జరిగినప్పటికీ, వాటికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. దీనివల్ల యువతలో నమ్మకం దెబ్బతింటోందని, కష్టపడి చదివే విద్యార్థులకు ఇది తీవ్రమైన అన్యాయమని పేర్కొన్నారు. పరీక్షల్లో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడం ప్రభుత్వ బాధ్యత అని రాహుల్ గాంధీ అన్నారు. "ఇది భారతదేశ యువత భవిష్యత్తుకు సంబంధించిన ఒక కీలకమైన సమస్య. ఇది మీకు, మీ తల్లిదండ్రులకు అవమానం. ఇది మీ కఠోర శ్రమకు, అంకితభావానికి అవమానం" అని విద్యార్థులను ఉద్దేశించి పేర్కొన్నారు.

## ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇక నుంచి మరో లెక్క

కాంగ్రెస్ హామీలు నమ్మి మోసపోయిన వారంతా ఇప్పుడు ఇంటింటికీ వెళ్లి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నేతల మాటలు నమ్మలేదని చెప్పి ఢిల్లీ నుంచి నేతలను తీసుకొచ్చి ఇక్కడ యువతను మోసం చేశారని అన్నారు. ఇప్పుడు వారంతా ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. దమ్ముంటే ఇప్పుడు అశోక్‌నగర్‌కు రావాలని పిలుపునిచ్చారు.సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలని మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేసిన నోటిఫికేషన్స్‌ను తాము భర్తీ చేసిన ఉద్యోగాలుగా ప్రచారం చేసుకుంటుందని కేటీఆర్ ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్టు నోటిఫికేషన్స్‌తో నిరూపిస్తూ తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు. "వివిధ యూనివర్శిటీ నుంచి తరలి వచ్చారు. వివిధ కోచింగ్ సెంటర్‌ల నుంచి తరలి వచ్చారు. యువశక్తి శివమెత్తితే పోరాటాలు పోటెత్తుతాయి. మీరు గళాలు గర్జిస్తే ప్రభుత్వాలు కూలిపోతాయి. రేపటి తరాన్ని దగా చేయవచ్చునా, ఒక మహాద్రోహాన్ని, జరిగిన మోసాన్ని గుర్తు చేసుకొని మోసకారులకు బుద్ధి చెప్పడానికి ఈ సమావేశం. ఇదే ప్రాంతంలో దగా జరిగింది. కాంగ్రెస్ 2023లో మీటింగ్ జరిగింది. ప్రియాంకా గాంధీ ఫేక్ కాగితం విడుదల చేశారు. దాన్ని యూత్ డిక్లరేషన్ అని పేరు పెట్టారు. యూత్ డిక్లరేషన్‌లో 24 హామీలు ఇచ్చారు. ఒక్కటి కూడా నెరవేరలేదు. ఇంత మోసం చేసే వారిని ఏం అందామో ఆలోచించండి. జీతులు మారిన కాంగ్రెస్ యువతరాన్ని మోసం చేసింది. చైతన్యవంతులైన ప్రజలు కాంగ్రెస్ చేతిలో మోసపోయారు. ఇంటింటికీ తిరిగి ప్రచారం చేసిన నిరుద్యోగులు ఇప్పుడు బాధపడుతున్నారు. రెచ్చగొట్టి ఓట్లు వేయించుకొని నమ్మి నట్టేట ముంచిన వారికి బెల్ట్ ట్రీట్‌మెంట్ ఇద్దామా? యువకులందరినీ పెట్టుకుంటే కొన్ని తరాలు పుట్టగతులు లేకుండా పోతారని మెసేజ్ వెళ్లాలి" అన్నారు.నిరుద్యోగ యువతతో పెట్టుకున్న రేవంత్ రెడ్డికి హిట్లర్ కంటే దారుణమైన పతనం ఉంటుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బాగుపడింది కాంగ్రెస్ పెద్దలు, వారి బంధువులేనని అన్నారు. రాష్ట్రాన్ని లూటీ చేస్తున్నారని ప్రజలకు మేలు చేయడం లేదని విమర్శించారు. ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తుంటే వారిపై కేసులు పెడుతున్నారని శాపనార్థాలు పెడుతున్నారని అన్నారు.

## చరిత్ర సృష్టించిన భారత్

తెలంగాణకు చెందిన ప్రముఖ స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్' రూపొందించిన తొలి ఆర్బిటాల్ క్లాస్ రాకెట్ 'విక్రమ్-1' నింగి వైపు దూసుకెళ్లింది. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్) మొదటి ప్రయోగ వేదిక నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు ఈ వాణిజ్యాత్మక రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించారు. నిజానికి ఈ ప్రయోగం ఉదయం 11:30 గంటలకే జరగాల్సి ఉన్నప్పటికీ, కౌంట్‌డౌన్ చివరి క్షణాల్లో చిన్న సాంకేతిక లోపం తలెత్తింది. అయితే, ఇస్రో, స్కైరూట్ శాస్త్రవేత్తలు అత్యంత వేగంగా ఆ లోపాన్ని సరిదిద్ది, కేవలం 35 నిమిషాల ఆలస్యంతో రాకెట్‌ను నింగిలోకి పంపించి భేష్ అనిపించుకున్నారు.

### తొలి ప్రయత్నంలోనే సరికొత్త రికార్డులు

ఈ 'మిషన్ ఆరంభ్' విజయం ద్వారా భారతదేశంలో ఒక ప్రైవేట్ స్టార్టప్ సంస్థ స్వంత రాకెట్ వాహక నౌక సాయంతో శాటిలైట్లను అంతరిక్ష కక్ష్యలోకి చేర్చిన మొదటి ప్రైవేట్ కంపెనీగా స్కైరూట్ ఏరోస్పేస్ చరిత్ర సృష్టించింది. గతంలో ప్రైవేట్ సంస్థలు కేవలం విడిభాగాలు సరఫరా చేయడానికి పరిమితం కాగా, ఇప్పుడు ఏకంగా పూర్తి స్థాయి రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించి సరికొత్త మైలురాయిని అధిగమించాయి. ఈ రాకెట్ తయారీలో వాడిన అధునాతన 'ఆల్ కార్బన్ కంపోజిట్' నిర్మాణం ఉక్కు కంటే బలమైనది, తేలికైనది కావడం గమనార్హం.

### నింగిలోకి చేరిన త్రీడీ ఇంజిన్.. విశ్వంలోకి 'ల్యాబ్ డైమండ్'

సాంకేతిక ఆవిష్కరణ పరంగా ఈ రాకెట్‌లో ఎన్నో అద్భుతాలు ఉన్నాయి. భూమి కక్ష్య దాటిన తర్వాత ఉపగ్రహాలను సరైన స్థానంలో ఉంచేందుకు వీలుగా 100 శాతం త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీతో చేసిన లిక్విడ్ ఇంజిన్‌ను ఇందులో వాడారు. అంతరిక్షంలో పేరుకుపోతున్న చెత్తను తొలగించే భవిష్యత్తు ప్రయోగాల కోసం 'ఎంట్రోస్' అనే రోబోటిక్ హ్యాండ్ పరికరాన్ని కూడా అంతరిక్షంలోకి పంపారు. వీటన్నిటితో పాటు సైన్స్, ఆర్ట్‌ల కలయికగా ల్యాబ్‌లో ప్రత్యేకంగా పెంచిన 'కాస్మిక్ బ్లూమ్' అనే డైమండ్‌ను వినూత్న పేలోడ్‌గా అంతరిక్షంలోకి పంపించారు.

### సైన్స్ దిగ్గజాలకు నివాళి.. ప్రధాని మోదీ సందేశం!

ఈ అద్భుత విజయంతో పాటు మన దేశ సైన్స్ రంగానికి ఊపిరిపోసిన మహనీయులకు సముచిత గౌరవం దక్కింది. భారత అంతరిక్ష పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాభాయ్, సర్ సీవీ రామన్, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే. అబ్దుల్ కలాం లతో పాటు శిల్పాలు చెక్కిన 18 క్యాబిన్ల చిన్న బంగారు రాకెట్‌ను ఈ ప్రయోగం ద్వారా గౌరవసూచకంగా పంపారు. అలాగే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన స్వహస్తాలతో "వందేమాతరం" అని రాసి, సంతకం చేసిన ప్రత్యేక పోస్ట్‌కార్డు కూడా ఈ రాకెట్ ద్వారా గగన విహారం చేసింది. చిన్న అంతరాయాన్ని సైతం సమర్థవంతంగా అధిగమించి సాధించిన ఈ విజయం, ప్రపంచ అంతరిక్ష మార్కెట్లో భారత ప్రైవేట్ రంగానికి తిరుగులేని గుర్తింపును తెచ్చిపెట్టింది.

## 2024లో రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారు

చంద్రబాబు కొడాలినానిని ఉద్దేశించి పరోక్షంగా కీలక వ్యాఖ్యలు చేశారు. మొన్న ఎన్నికల్లో చాలా వరకు చెత్తను ప్రజలే క్లీన్ చేశారు. ఆ నోర్లు ఏం నోరులో నాకు అర్థం కాలేదు. ఆ నోర్లన్నీ ఫినాయిల్‌తో శుభ్రం చేశారు. ఇంకా అక్కడక్కడ చెత్త వాసనలు ఉన్నాయి. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబంపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. అడిగితే ఇది మా స్వేచ్ఛ అంటున్నారు అని మండిపడ్డారు.పట్టణ, గ్రామీణ ప్రాంతాల సమగ్ర వికాసమే లక్ష్యంగా గుడివాడ సభలో సీఎం చంద్రబాబు పలు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా అమృత్ 2.0 ఏఐడీయూఎఫ్ అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించడంతో పాటు, పారిశుధ్య నిర్వహణలో అద్భుత ప్రతిభ కనబరిచిన స్వర్ణ పంచాయతీ ఉద్యోగులకు, కార్మికులకు స్వచ్ఛ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా కాలుష్యం మానవ ఆరోగ్యంపై చూపుతున్న ముప్పును ప్రస్తావిస్తూ, రాబోయే అక్టోబర్ 2వ తేదీ నాటికి ఆంధ్రప్రదేశ్‌ను చెత్త లేని రాష్ట్రం గా మార్చడమే తమ ప్రభుత్వ సంకల్పమని ప్రకటించారు. ప్రతి కుటుంబం ఇంట్లోనే తడి, పొడి చెత్తను వేరు చేస్తూ, తడి చెత్తను కంపోస్ట్‌గా మార్చుకునే బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు.కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుపై ముఖ్యమంత్రి కీలక ప్రకటన చేశారు. విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేసే ప్రతిష్ఠాత్మక తల్లికి వందనం పథకం సొమ్మును ఈ నెలలోనే విడుదల చేస్తామని స్పష్టం చేశారు. కేవలం సాధారణ వర్గాలకే కాకుండా, సమాజ సేవలో నిరంతరం శ్రమిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు, స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగస్వాములైన కార్మికుల కుటుంబాలకు కూడా ఈ 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేస్తామని ప్రకటించి మహిళా లోకానికి పెద్ద భరోసానిచ్చారు. సంక్షేమం, సంస్కరణలు సమాంతరంగా నడుస్తాయనేందుకు తమ ప్రభుత్వమే నిదర్శనమన్నారు.వ్యవసాయ, నీటిపారుదల రంగానికి తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తుంటే అనేకమంది అడ్డుపడ్డారని, కానీ తాము పట్టుబట్టి 12 నెలల్లోనే దానిని పూర్తి చేసి కృష్ణా డెల్టాను కరువవకుండా కాపాడామని చెప్పారు. పట్టిసీమ ద్వారా ఇప్పటివరకు 450 టీఎంసీల గోదావరి నీటిని కృష్ణా బేసిన్‌కు తరలించిన రికార్డు తమదేనన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం సర్వనాశనం చేసిందని మండిపడ్డ భౌగోళిక వ్యూహకర్త చంద్రబాబు, ఇప్పుడు పనులను మళ్లీ వేగవంతం చేశామని, 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును వంద శాతం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తానని సవాల్ విసిరారు. రాష్ట్రంలోని నదులన్నింటినీ అనుసంధానం చేయడమే తమ అంతిమ లక్ష్యమన్నారు.

## ఇదేనా మహిళల భద్రతా.? ఇదేనా మీ సుపరిపాలన.

ఈ దారుణానికి చంద్రబాబు ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని ఆయన విమర్శించారు. ఈ ఘటన బుధవారమే జరిగినా, మూడు రోజులపాటు దానిని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని, చివరకు ఆ వీడియోలు సోషల్ మీడియాలో బయటకు వచ్చి రాష్ట్ర ప్రజలంతా ఈ పరిపాలనను అసహ్యించుకున్న తర్వాతే ప్రభుత్వం స్పందించిందని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పుడు తానేదో గొప్పగా చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు హడావుడి చేయడం మరింత సిగ్గుచేటని అన్నారు.ఆ వీడియోలను కప్పిపుచ్చడంపై చూపిన శ్రద్ధను నిందితులను పట్టుకోవడంపై చూపలేదని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తనపై తొలిసారి దాడి జరిగిన వెంటనే బాధితురాలు పోలీసులను ఆశ్రయించినప్పుడు వారు స్పందించి ఉంటే, ఆ తర్వాత ఇంతటి ఘోరం జరిగేది కాదు కదా అని ప్రశ్నించారు. ఆమె ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకుని ఉంటే ఈ దారుణం జరిగేదా? అని నిలదీశారు. ఫిర్యాదు చేసిన మహిళకు రక్షణ కల్పించకుండా మౌనం వహించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు."అసలు పోలీస్ స్టేషన్లు ఉన్నది ఎందుకు? బాధితుల ఫిర్యాదులను స్వీకరించడానికా? లేక అధికార పార్టీ నాయకులు ఏం చెబితే అది చేయడానికా? బాధితురాలికి అండగా నిలవకపోగా, పంచాయితీలు చేయడానికి ప్రయత్నిస్తారా? వీడియోలు బయటకు వస్తేనే చట్టం మేల్కొంటుందా? బాధితురాలి ఫిర్యాదుకు విలువ లేదా? నేరం జరుగుతున్నప్పుడు స్పందించకుండా, ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికిన తర్వాత చర్యల పేరుతో నాటకాలు ఆడటం ఏ రకమైన పోలీసింగ్? రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై ఈ చంద్రబాబు ప్రభుత్వం కావాలనే దాడులను ప్రోత్సహించింది. ఆ అరాచకాలను కప్పిపుచ్చడానికి పోలీసు వ్యవస్థను ఒక రాజకీయ ఆయుధంగా మార్చుకుంది. చట్టాన్ని అధికార పార్టీకి చుట్టంగా, ప్రతిపక్షాలపై వేధింపులకు, అక్రమ కేసులకు ఒక సాధనంగా మార్చి రాష్ట్రాన్ని జంగిల్‌రాజ్‌గా దిగజార్చింది" అని ఆయన తీవ్రంగా విమర్శించారు.అధికార పార్టీ నాయకులు ఏం చేసినా పోలీసులు రక్షిస్తారనే ధైర్యం ఈ రెడ్‌బుక్‌పాలనలో గ్రామాలు, వార్డుల స్థాయి వరకూ పాకిందని జగన్ అన్నారు. అందుకే టీడీపీ కూటమికి చెందిన పలువురు నాయకులు దుశ్శాసనుల్లా తయారయ్యారని మండిపడ్డారు. ఎలాంటి దారుణాలు చేసినా, ముఖ్యంగా మహిళలపై దాడి చేసినా, తమను కాపాడటానికి చంద్రబాబు ఉన్నారనే ధైర్యం వారిలో పెరిగిపోయిందని ధ్వజమెత్తారు. ఈ పరిస్థితి రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా చేసిందని జగన్ ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల దురాగతాల నుంచి తమను తాము కాపాడుకోవాల్సిన దుస్థితికి మహిళల చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "చంద్రబాబు గారూ, ఇదేనా మీరు చెప్పే మహిళా భద్రత? ఇదేనా మీ సుపరిపాలన? ఇదేనా మీ పోలీసింగ్? మహిళల ఆగ్రహమే మీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతుంది" అని ఆయన హెచ్చరించారు.

## నేనున్నంత వరకు బీఆర్ఎస్ సర్కారు రానివ్వను

ఉద్యమ స్ఫూర్తిదాత అందెశ్రీ గౌరవార్థం ఘట్‌కేసర్‌లో నిర్మించనున్న 'అందెశ్రీ స్మృతివనం' పనులకు ముఖ్యమంత్రి శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగిస్తూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "దొరల గడీల ముందు తలవంచను" అని చాటిచెప్పిన ధైర్యశాలి అందెశ్రీ అని ముఖ్యమంత్రి కొనియాడారు. ప్రజల కవిగా, గాయకుడిగా అందెశ్రీ అందించిన సేవలను స్మరించుకుంటూ, ఆయనను తన 'ఆత్మబంధువు'గా అభివర్ణించారు.

గత పాలకులు ఆయన వంటి గొప్ప కళాకారులను విస్మరించారని మండిపడ్డారు. ఇదే క్రమంలో, కల్వకుంట్ల కుటుంబంపై రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు.గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతను పట్టించుకోకపోవడంతో వారు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఏళ్ల తరబడి గ్రూప్-1 వంటి పరీక్షలు కూడా నిర్వహించలేదని రేవంత్ రెడ్డి ఆరోపించారు. అందుకు భిన్నంగా, తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే సుమారు 70 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని, అభ్యర్థుల తల్లిదండ్రుల సమక్షంలోనే నియామక పత్రాలను అందజేస్తున్నామని తెలిపారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఫామ్‌హౌస్‌ల నిర్మాణం కోసం కేసీఆర్ కుటుంబం తెలంగాణ సంపదను దోచుకుందని, మళ్లీ ఎవరైనా అటువంటి ప్రయత్నం చేస్తే ఎదిరించడానికి అందెశ్రీ పాట రూపంలో పుడతాడని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందెశ్రీని తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని దుయ్యబట్టారు. ప్రజాకవి గద్దర్‌ను సైతం ప్రజాభవన్ గేటు వద్ద ఎర్రటి ఎండలో నిలబెట్టి అవమానించారని మండిపడ్డారు. వారిద్దరిని అవమానించినప్పుడే దొరల పాలనకు చరమగీతం పాడాలని తెలంగాణ ప్రజలు నిర్ణయించుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) డిజిటల్ చెల్లింపుల రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించాలన్న ప్రతిపాదన ప్రస్తుతం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. ఒకవేళ ఈ నిర్ణయం అమల్లోకి వస్తే, వ్యాపార నిర్వహణ వ్యయం పెరిగి, తద్వారా వినియోగదారుల కొనుగోలు శక్తిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే, యూపీఐ వ్యవస్థను దీర్ఘకాలికంగా ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం ప్రాథమికంగా పెద్ద వ్యాపార సంస్థలను లక్ష్యంగా చేసుకుని ఈ రుసుములను ప్రవేశపెట్టాలని భావిస్తోంది. ముఖ్యంగా ఏడాదికి రూ. 1 కోటి నుంచి రూ. 1.5 కోట్లు పైచిలుకు టర్నోవర్ ఉన్న వ్యాపారులపై 0.05 శాతం నుంచి 0.07 శాతం వరకు నామమాత్రపు ఎండీఆర్ విధించే అవకాశాలను పరిశీలిస్తోంది. కాగా, చిన్న వ్యాపారులు, కిరాణా దుకాణాలు మరియు వ్యక్తుల మధ్య జరిగే లావాదేవీలకు మాత్రం ప్రస్తుతమున్న మినహాయింపును కొనసాగించే అవకాశం ఉంది.
2020 జనవరి నుంచి యూపీఐ లావాదేవీలపై జీరో-ఎండీఆర్ విధానం కొనసాగుతోంది. దీనివల్ల డిజిటల్ లావాదేవీలు గణనీయంగా పెరిగినప్పటికీ, బ్యాంకులు మరియు పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లపై ఆర్థిక భారం అధికమైంది.

ప్రభుత్వం ఏటా సుమారు రూ. 2,000 కోట్ల ప్రోత్సాహకాలను అందిస్తున్నప్పటికీ, ఇవి పరిశ్రమ మొత్తం నిర్వహణ ఖర్చులలో కేవలం 11 శాతాన్ని మాత్రమే భర్తీ చేస్తున్నాయని అంచనా. ఈ నేపథ్యంలో, యూపీఐ వ్యవస్థ మనుగడ సాగించాలంటే నామమాత్రపు రుసుము అనివార్యమని పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలు అభిప్రాయపడుతున్నాయి. ఒకవేళ కొత్తగా ఛార్జీలు విధిస్తే, వ్యాపారులు ఆ భారాన్ని వస్తువుల ధరలు పెంపు లేదా రాయితీల తగ్గింపు ద్వారా వినియోగదారులపైకి మళ్లించే ప్రమాదం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇది పరోక్షంగా వినియోగంపై ప్రభావం చూపవచ్చని వారు భావిస్తున్నారు. ఎండీఆర్ ప్రభావం పరోక్షంగా చిన్న వ్యాపారాలపై కూడా పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఏదేమైనా, డిజిటల్ చెల్లింపుల వృద్ధికి విఘాతం కలగకుండా, వ్యవస్థ స్థిరత్వాన్ని కాపాడేలా ప్రభుత్వం సమతుల్యమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## తెలంగాణ బీజేపీలో కీలక పరిణామం!

సీనియర్ నేతలు ఎవరికి వారుగా ఉంటున్న తీరుపై అసహనంతో ఉంది. అందుకే వారిని ఒక తాటిపైకి తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది. ముఖ్యంగా బీసీ వర్గానికి చెందిన ఈటల రాజేందర్, బండి సంజయ్ మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించాలని చూస్తోంది. అందుకు పార్టీ దూతగా ఉన్న అభయ్ పాటిల్ జోక్యం చేసుకున్నారు. ఇద్దరి నేతలతో మీటింగ్ ఏర్పాటు చేసినట్టు సమాచారం. దీనికి సీనియర్ నేత, ఎంపీ లక్ష్మణ్ నివాసం వేదిక అయ్యిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణలో అధికారంలోకి రావాలని టార్గెట్ ఫిక్స్ చేసుకున్న బీజేపీ ఆ దిశగానే వ్యూహాలను రచిస్తోంది. అందులో భాగంగా ముందు పార్టీని దారిలో పెట్టాలని చూస్తోంది. అందులో భాగంగానే రాష్ట్ర పార్టీ పరిస్థితిపై ఎప్పటికప్పుడు నివేదికలు అడుగుతోంది. క్షేత్రస్థాయిలో పార్టీ బలాలు, బలహీనతలపై స్టడీ చేస్తోంది. ఈ రిపోర్టుల్లో నేతల మధ్య కోఆర్డినేషన్ లేదని తేలింది. అసలు ఒకరిద్దరు నేతల మధ్య సఖ్యత లేదని, తారాస్థాయిలో విభేదాలు ఉన్నట్టు వెల్లడైంది. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన రిపోర్టులను పరిశీలించిన అనంతరం ముందుగా పార్టీ నేతలను దారిలోకి తీసుకురావాలని చూస్తోంది. ముఖ్యంగా ఈటల రాజేంద్ర, బండి సంజయ్ మధ్య ఉన్న విభేదాలు పార్టీకి చాలా ఇబ్బందిగా మారుతున్నాయని తెలుసుకుంది. ముందు వారిద్దరితోనే పార్టీ ప్రక్షాళన మొదలుపెట్టాలని చూస్తోంది. దీని కోసం పార్టీ దూతగా అభయ్ పాటిల్‌ను ఢిల్లీ నుంచి పంపించారు. అభయ్‌పాటిల్ వచ్చీరాగానే సంజయ్, ఈటలతో భేటీ రిపారు. సీనియర్ నేత, ఎంపీ లక్ష్మణ్ నివాసంలో ఈ సీక్రెట్ సమావేశం జరిగింది. ఇద్దరి నేతలు వారి వారి సమస్యలను ఆయన ముందు ఉంచారు. పార్టీలో చేరినప్పటి నుంచి ఒకరంటే ఒకరికి పడటం లేదని తేలింది. ఒకరిపై ఒకరు సీరియస్ ఫిర్యాదులు చేసుకున్నారు. దీనిపై అధిష్ఠానంతో మాట్లాడతాని ప్రస్తుతానికి కోఆర్డినేషన్‌తో కార్యక్రమాల్లో పాల్గొనాలని ఇరువురి నేతలకు అభయ్ హైకమాండ్ మాటగా చెప్పినట్టు తెలుస్తోంది. ఈ సమావేశం జరిగిన తర్వాత ఎంపీ లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయారని అన్నారు. తెలంగాణలో అధికారంలోకి రావడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై మాట్లాడామని అన్నారు.నేతల మధ్య ఎలాంటి విభేదాలు లేవని వాటికి చెక్ చెప్పడానికే మీడియా ముందుకు వచ్చామని తెలిపారు. ఒక కుటుంబ పార్టీగా తాము మాట్లాడుకున్నామని అన్నారు. బీజేపీ అధికారంలోకి రావడానికే అంతా కలిసి కట్టుగా పని చేస్తామని తెలిపారు. తెలంగాణ మహిళా రిజర్వేషన్లు, సీట్ల సంఖ్య పెరుగుతుందని అన్నారు. తెలంగాణ జమిలీ ఎన్నికలే వస్తాయని లక్ష్మణ్ తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ఈటల రాజేందర్, బండి సంజయ్ ఎంపీ లక్ష్మణ్ పక్కనే ఉన్నారు. అంతకంటే ముందు వారంతా ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్న వీడియోలు వైరల్ అవుతున్నాయి.

## పోలీసులపై కారం చల్లి, కుర్చీలు విసిరి

కారం చల్లారు. కుర్చీలు విసిరేస్తూ, రాళ్లతో దాడికి సైతం పాల్పడ్డారు. ఆందోళనకారుల దాడిలో డీసీపీ, సీఐ సహా పలువురు పోలీసులకు గాయాలయ్యాయని తెలుస్తోంది. డీసీపీలు యోగేష్ గౌతమ్, నారాయణరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించగా ఆందోళనకారుల దాడిలో గాయపడినట్లు సమాచారం.

### ఆందోళనకారులతో పాటు బీజేపీ నేతల అరెస్ట్..

రైతులకు మద్దతుగా వచ్చిన బీజేపీ నేతల్ని, ఆందోళనకారులను అరెస్ట్ చేసి అక్కడి నుంచి నందిగామ పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నారు. శంషాబాద్ మండలం బహదూర్‌గూడ గ్రామంలో బుల్లెట్ ట్రైన్ హబ్ ఏర్పాటు కోసం ప్రభుత్వం భూసేకరణకు సిద్ధం కావడంతో అక్కడ యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ భూసేకరణను వ్యతిరేకిస్తూ స్థానిక రైతులు గత కొన్ని రోజులుగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. ఈ క్రమంలో వివాదాస్పద భూముల్లో చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయడానికి హైడ్రా అధికారులు వెళ్లారు. ఈ క్రమంలో బహదూర్‌గూడలో తీవ్ర ఉద్రిక్తత నెలకొని అక్కడ హై టెన్షన్ వాతావరణం ఏర్పడింది. పరిస్థితిని అదుపు చేయడానికి పోలీసులు బహదూర్‌గూడ గ్రామాన్ని పూర్తిగా దిగ్బంధించి, భారీగా బలగాలను మోహరించారు.ప్రభుత్వం నోటిఫై చేసిన భూమిలో హైడ్రా ఫెన్సింగ్ వేస్తోందని అధికారులు చెబుతున్నారు. అయితే తమ భూములను స్వాధీనం చేసుకోకుండా అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నామని రైతులు చెబుతున్నారు. ఆందోళన చేపట్టిన రైతులు, బీజేపీ నేతల్ని పోలీసులు నిలువరించారు. పలువురు ఆందోళనకారులను అరెస్టు చేసి తరలిస్తుండగా రైతులు, గ్రామస్తులు పోలీసు వాహనాలను అడ్డుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు హైడ్రా అధికారులు, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.మరోవైపు బాధితులకు మద్దతు తెలిపేందుకు శనివారం ఉదయం బహదూర్‌గూడ గ్రామానికి చేరుకున్న బీఆర్ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని చెక్ పోస్ట్ వద్దే పోలీసులు అడ్డుకున్నారు. రైతులకు న్యాయం చేయకుండా 650 ఎకరాల భూమిని ఎలా లాక్కుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అన్నదాతలపై దౌర్జన్యం చేయడం సరికాదంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు బీఆర్ఎస్ నేత కార్తీక్ రెడ్డిని అరెస్ట్ చేసి నందిగామ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుంది"

- బిఆర్ఎస్ నేత కార్తీక్ రెడ్డి హెచ్చరిక
- బహుద్దూర్‌గూడ రైతులకు మద్దతుగా వెళ్లిన బీఆర్ఎస్ యువనేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అరెస్ట్
- నందిగామ పోలీస్ స్టేషన్‌కు తరలింపు..
- సంఘీభావం తెలిపిన షాద్‌నగర్ బీఆర్ఎస్ నాయకులు



**రంగారెడ్డి** శంషాబాద్ మండలం బహుద్దూర్‌గూడలో ప్రతిపాదిత బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు టెర్మినల్ కోసం భూముల సేకరణ అంశం ఉద్రిక్తతకు దారితీసింది. భూముల సేకరణ కోసం అధికారులు గ్రామానికి చేరుకోగా, ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీలు, సరైన పరిహారం ప్రకటించిన తర్వాతే భూములు ఇస్తామని రైతులు, గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న బాధిత రైతులు, గ్రామస్తులకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన బీఆర్ఎస్ యువనేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. అనంతరం ఆయనను రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని నందిగామ పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న షాద్‌నగర్ బీఆర్ఎస్ నాయకులు రాజా వరప్రసాద్, రాంబల్ నాయక్, వంకాయల నారాయణ రెడ్డి, నక్కల వెంకటేష్ గౌడ్ నందిగామ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని కార్తీక్ రెడ్డికి సంఘీభావం తెలిపారు. రైతుల సమస్యలపై పోరాడుతున్న నాయకుడిని అరెస్టు చేయడం సరికాదని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నందిగామ పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడిన పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, పోలీసులు అరెస్టు చేసినంత మాత్రాన తాను వెనక్కి తగ్గేది లేదన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. "అరెస్టులతో భయపడేది లేదు. రైతులకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదు. రైతుల హక్కుల కోసం చివరి వరకు పోరాడుతాం" అని కార్తీక్ రెడ్డి అన్నారు.బహుద్దూర్ గూడ రైతులకు న్యాయమైన పరిహారం, ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీలు ఇవ్వకుండా బలవంతంగా భూములు సేకరించే ప్రయత్నాలు చేయడం తగదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. రైతుల హక్కులను కాపాడేందుకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు..

## గోదావరి పడవ ప్రమాదం అత్యంత విషాదకరం

**- పీవీఎన్ మాధవ్**

**అమరావతి,** పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగూడెం సమీపంలోని గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లిన ఐదుగురు మృతి చెందిన ఘటన అత్యంత విషాదకరమని ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన తుర్రం భారతి, ఊకే సుశీల, ఊకే లక్ష్మి, బాసిబోయిన బాలరాజు, ఊకే రమేష్ కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఈ తీరని విషాదాన్ని భరించే మనోధైర్యాన్ని వారి కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక అధికారులు మృతుల కుటుంబాలకు తక్షణ సహాయం అందించి, వారికి అన్ని విధాలుగా అండగా నిలవాలని పీవీఎన్ మాధవ్ కోరారు. అలాగే గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారుల భద్రత కోసం అవసరమైన జాగ్రత్తలు, రక్షణ చర్యలను మరింత పటిష్ఠంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.భవిష్యత్తులో ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా నదీ ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టం చేసి, మత్స్యకారుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పీవీఎన్ మాధవ్ సూచించారు.

# 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలు

ఈసారి జాతీయ అవార్డుల వేదికపై తెలుగు సినిమా తన సత్తాను చాటింది. 'పుష్ప 2: ది రూల్', 'ఖల్కి 2898 ఏడీ', 'కమిటీ కుర్రోళ్లు', 'లక్కీ భాస్కర్', '35 చిన్న కథ కాదు' చిత్రాలు పలు విభాగాల్లో పురస్కారాలు గెలుచుకుని తెలుగు సినిమా కీర్తిని ఇనుమడింపజేశాయి. ప్రముఖ మలయాళ నటుడు మమ్ముట్టి ('భ్రమయుగం') మరియు హిందీ నటుడు కార్తీక్ ఆర్యన్ ('చందూ ఛాంపియన్') ఉత్తమ నటుడి పురస్కారాన్ని పంచుకోగా, 'ఆర్టికల్ 370' చిత్రంలో అద్భుత నటనకు గాను యామి గౌతమ్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసిన ఇతివృత్తంతో తెరకెక్కిన 'ఆర్టికల్ 370' ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌గా నిలిచింది. 'అమరన్' చిత్రానికి రాజ్ కుమార్ పెరియసామి ఉత్తమ దర్శకుడిగా పురస్కారం అందుకున్నారు. ఫీచర్ ఫిల్మ్స్ జ్యూరీకి ప్రముఖ దర్శకుడు జయరాజ్ ఛైర్మన్‌గా వ్యవహరించారు.

### ఫీచర్ ఫిల్మ్స్ అవార్డుల పూర్తి జాబితా:

ఉత్తమ ఫీచర్ ఫిల్మ్: ఆర్టికల్ 370 (హిందీ) ఉత్తమ దర్శకుడు: రాజ్ కుమార్ పెరియసామి (ఫిల్మ్: అమరన్, తమిళం) ఉత్తమ ప్రజాదరణ పొందిన వినోదాత్మక చిత్రం: ఖల్కి 2898 ఏడీ (తెలుగు) ఉత్తమ నటుడు (సంయుక్తంగా): మమ్ముట్టి (ఫిల్మ్: భ్రమయుగం, మలయాళం) కార్తీక్ ఆర్యన్ (ఫిల్మ్: చందూ ఛాంపియన్, హిందీ) ఉత్తమ నటి: యామి గౌతమ్ (ఫిల్మ్: ఆర్టికల్ 370, హిందీ) ఉత్తమ సహాయ నటుడు: సంజయ్ మిశ్రా (ఫిల్మ్: భక్షక్, హిందీ) ఉత్తమ సహాయ నటి (సంయుక్తంగా): రూపశ్రీ వకాడి (ఫిల్మ్: మిథ్య, కన్నడ) సచినా నమిదాస్ (ఫిల్మ్: మహారాజ, తమిళం) ఉత్తమ బాలనటులు (సంయుక్తంగా): శ్రీజ చక్రవర్తి, కావ్య మైతి, రిధాన్ బెనర్జీ (ఫిల్మ్: ఒంటరి, బెంగాలీ) అరుణ్ దేవ్ పోతుల (ఫిల్మ్: 35 చిన్న కథ కాదు, తెలుగు) అతీష్ ఎస్. శెట్టి (ఫిల్మ్: మిథ్య, కన్నడ) ఉత్తమ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్): సుకుమార్ (ఫిల్మ్: పుష్ప 2: ది రూల్, తెలుగు) ఉత్తమ స్క్రీన్‌ప్లే (అడాప్టెడ్): యోగేష్ దేశ్‌పాండే (ఫిల్మ్: సురేంద్ర సుధా భలే, మరాఠీ) ఉత్తమ సంభాషణలు: రఘునీ అధులూరి (ఫిల్మ్: లక్కీ భాస్కర్, తెలుగు) ఉత్తమ సంగీత దర్శకుడు (పాటలు): శశ్వంత్ సచ్‌దేవ్ (ఫిల్మ్: ఆర్టికల్ 370, హిందీ) ఉత్తమ సంగీత దర్శకుడు (నేపథ్య సంగీతం): జీవీ ప్రకాశ్ కుమార్ (ఫిల్మ్: అమరన్, తమిళం) ఉత్తమ గేయ రచయిత: మనోజ్ ముంతశిర్ (పాట: జానే దో, ఫిల్మ్: మైదాన్, హిందీ) ఉత్తమ నేపథ్య గాయకుడు: అభయ్ జోధ్‌పుర్కర్ (పాట: నవసాచి గవూరి, ఫిల్మ్: గట్ గనపతి, మరాఠీ) ఉత్తమ నేపథ్య గాయని: వైకోమ్ విజయలక్ష్మి (పాట: అంగనా, ఫిల్మ్: మాలం, మలయాళం) ఉత్తమ సినిమాటోగ్రఫీ: షెహనాద్ జలాల్ (ఫిల్మ్: భ్రమయుగం, మలయాళం) ఉత్తమ ఎడిటింగ్: కలైవణ్ణన్ (ఫిల్మ్: అమరన్, తమిళం) ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: నితిన్ చౌదరి (ఫిల్మ్: ఖల్కి 2898 ఏడీ, తెలుగు) ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: దీపాలి నూర్, శీతల్ శర్మ (ఫిల్మ్: పుష్ప 2: ది రూల్, తెలుగు) ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్: రిత్విక్ కుమార్ (ఫిల్మ్: కమిటీ కుర్రోళ్లు, తెలుగు) ఉత్తమ యాక్షన్ డైరెక్షన్ (స్టంట్స్): అనిల్ అరసు (ఫిల్మ్: మహారాజ, తమిళం) ఉత్తమ కొరియోగ్రఫీ: విజయ్ గంగూలీ (ఫిల్మ్: ఉలజ్, హిందీ) ఉత్తమ సౌండ్ డిజైన్: మనస్ చౌదరి (ఫిల్మ్: భూల్ భులయ్యా 3, హిందీ) ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు: రణదీప్ హుడా (ఫిల్మ్: స్వాతంత్ర్య వీర్ సావర్కర్, హిందీ) ఉత్తమ బాలల చిత్రం: 35 చిన్న కథ కాదు (తెలుగు) జాతీయ, సామాజిక, పర్యావరణ విలువలను ప్రోత్సహించే ఉత్తమ చిత్రం: కెప్టెన్ మిల్లర్ (తమిళం) ప్రత్యేక ప్రస్తావన: ధనుష్ (నటుడు, ఫిల్మ్: కెప్టెన్ మిల్లర్, తమిళం) సుధాన్ జీ (సౌండ్ మిక్స్ ఇంజనీర్, ఫిల్మ్: మేజర్, తమిళం)

### ప్రాంతీయ భాషల్లో ఉత్తమ చిత్రాలు:

ఉత్తమ తెలుగు చిత్రం: కమిటీ కుర్రోళ్లు ఉత్తమ తమిళ చిత్రం: రాయన్ ఉత్తమ హిందీ చిత్రం: శ్రీకాంత్ ఉత్తమ కన్నడ చిత్రం: మిథ్య ఉత్తమ మలయాళ చిత్రం: ఫెమినా ఫాతిమా ఉత్తమ గుజరాతీ చిత్రం: మెరిన్ ఉత్తమ బెంగాలీ చిత్రం: చలచిత్ర ఎఖోన్ ఉత్తమ మరాఠీ చిత్రం: ముక్కాం పోస్ట్ బం బిల్వాడి ఉత్తమ అస్సామీ చిత్రం: జాయ్‌ఫుల్ ఆరెంజ్ అండ్ పర్పుల్ ఉత్తమ ఒడియా చిత్రం: ది టైడ్ ఆఫ్ టైమ్స్ ఉత్తమ మణిపురి చిత్రం: సులిత ఉత్తమ కొంకణి చిత్రం: మోగ్
ఉత్తమ గర్వాలీ చిత్రం: ధీ ఉత్తమ తుళు చిత్రం: ఇలు

### నాన్-ఫీచర్ ఫిల్మ్స్ అవార్డులు:

నాన్-ఫీచర్ ఫిల్మ్స్ విభాగంలో 'బంగార్' (మరాఠీ, ఇంగ్లీష్) ఉత్తమ చిత్రంగా నిలిచింది. పలు డాక్యుమెంటరీలు, షార్ట్ ఫిల్మ్‌లు, యానిమేషన్ చిత్రాలకు పురస్కారాలు లభించాయి.
ఉత్తమ నాన్-ఫీచర్ ఫిల్మ్: బంగార్ (మరాఠీ, ఇంగ్లీష్) ఉత్తమ దర్శకుడు: ఆనంద్ ఆల్మే (ఫిల్మ్: స్టాట్యూ ఆఫ్ యూనిటీ ప్రతీక్, హిందీ) ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు: రాజ్ ముర్మూ (ఫిల్మ్: అంజన్, సంతాలీ) ఉత్తమ డాక్యుమెంటరీ: రామ్ నామీ (హిందీ) ఉత్తమ షార్ట్ ఫిల్మ్: హమ్ సఫర్ (మరాఠీ) ఉత్తమ యానిమేషన్ ఫిల్మ్: టచ్డ్ అజ్ వాటర్స్ (సైలెంట్) ఉత్తమ జీవితచరిత్ర చిత్రం: కాకోరి (హిందీ) ఉత్తమ ఆర్ట్ ఁ కల్చర్ ఫిల్మ్: మీరా నిదా (హిందీ) ప్రత్యేక జ్యూరీ ప్రస్తావన: చోళ దోర (హిందీ), భద్రకాళి నాటకం మండలం (మలయాళం)

### సినిమాపై ఉత్తమ రచన:

సినిమా విమర్శలు, పుస్తకాల విభాగంలోనూ అవార్డులను ప్రకటించారు. ఉత్తమ సినీ విమర్శకుడు: సంజీవ్ శ్రీవాత్సవ (హిందీ) సినిమాపై ఉత్తమ పుస్తకం: ఐ స్టాండ్ ఫర్ యూ, ది స్టేట్స్ స్టాండ్ ఫర్ అస్ (రచయిత: కంజనేరు ప్రదీప్ కుమార్ శెట్టి, భాష: కన్నడ) ఈ అవార్డుల ప్రదానోత్సవం త్వరలోనే రాష్ట్రపతి భవన్‌లో జరగనుంది. విజేతలకు రాష్ట్రపతి పురస్కారాలను అందజేస్తారు.

## పోడు భూముల వివాదంలో ఫారెస్ట్ అధికారులు, గిరిజనుల మధ్య ఘర్షణ

**భద్రాద్రి కొత్తగూడెం** అశ్వాపురం మండలం మనుబోతుల గూడెంలో పోడు భూముల వివాదంలో ఫారెస్ట్ అధికారులు, గిరిజనుల మధ్య ఘర్షణ చెలరేగింది. ఒకరిపై ఒకరు పరస్పర దాడులు చేసుకున్నారు. ఘటనలో ముగ్గురు గిరిజన మహిళలకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన మహిళలను మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స జరుగుతోంది. మణుగూరు ఫారెస్ట్ రేంజర్ ఉపేందర్ నేతృత్వంలో సుమారు 40 మంది సిబ్బందితో గిరిజనులపై దాడి చేశారని గ్రామస్థుల ఆరోపణ.మహిళలని కూడా చూడకుండా అటవీ సిబ్బంది విసిరిపారేశారని, అమానుషంగా ప్రవర్తించారని గిరిజనులు మండిపడ్డారు. రహదారులు, కమ్యూనికేషన్ లేని మారుమూల గ్రామం కావడంతో ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

## గిరిజన సంక్షేమ అధికారి జాదవ్ అంబాజీకి ఘన సన్మానం



**ఆసిఫాబాద్,** కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖకు నూతనంగా జిల్లా గిరిజన సంక్షేమ అధికారిగా పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించిన జాదవ్ అంబాజీని టీఎస్‌టి బ్ల్యూటీయూ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. నూతన బాధ్యతల సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆయన సమర్థవంతమైన నాయకత్వం అందిస్తారని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా జాదవ్ అంబాజీ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని, విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు శాఖ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పి ఏం ఆర్ సి ఏ సి ఏం ఓ పూర్కా ఉద్ధవ్, జి సి డి ఓ కొట్నాక్ శకుంతల, జిల్లా క్రీడా అధికారి మడావి శేఖు, ఏ టి డి ఓలు చిరంజీవి, భాస్కర్, టీఎస్‌టి బ్ల్యూటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నైతం కృష్ణ రావ్, సంఘం అధ్యక్షులు కొట్నాక్ యాదవరావ్, జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రవీందర్, ప్రధాన కార్యదర్శి మడావి గోపాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు కోడెం రవీందర్, కూడ్మేత అనంత్, వెడ్మ యశ్వంత్ రావ్, మడావి పోచాని, షెడ్మాకీ వెంకటేష్, బండ మీనారెడ్డి, చాకిలం మధు, చంద్రశేఖర్ పవార్ లింబారావ్, కూడ్మేత జంగు, నందారాం, మడావి లచ్చు తో పాటు గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని నూతన అధికారికి శుభాకాంక్షలు తెలిపారు.

# ధర్పల్లి ఎన్‌టీఆర్ కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్

ధర్పల్లి (ప్రశ్న న్యూస్ ) పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు,నిజామాబాద్ జిల్లా ఏసీపీ ఆధ్వర్యంలో ధర్పల్లి మండలంలోని ఎన్‌టీఆర్ కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ధర్పల్లి సర్కిల్ పరిధిలోని సీఐ,ధర్పల్లి ఎస్సై, సిరికొండ ఎస్సై వారి సిబ్బంది, జక్రాన్‌పల్లి జ ఎస్సై, వారి సిబ్బంది డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ల,సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎన్‌టీఆర్ కాలనీలో ప్రతి ఇంటిని తనిఖీ చేయడం జరిగింది.అలాగే,సరైన పత్రాలు లేని 32 వాహనాలను గుర్తించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజలకు సీసీ కెమెరాల ప్రాముఖ్యత, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం, ట్రాఫిక్ నిబంధనలు,హెల్మెట్ వినియోగం వాహనాలకు సంబంధించిన అన్ని చట్టబద్ధమైన పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని అవగాహన కల్పించారు. ప్రజల






భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనల గురించి వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరడం జరిగింది.

# అగర్వాల్ ఫౌండ్రీస్ కంపెనీ పోవాల్సిందే

**రంగాయిపల్లి, చెట్ల గౌరారం ప్రజలు ఆరోగ్యంగా బ్రతకాల్సిందే**

**కాలుష్య బాధితుడిని పరామర్శించిన బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి**







గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) మనోహరాబాద్ మండలంలోని రంగాయిపల్లి గ్రామంలో ఎంఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్ కంపెనీ నుంచి వెలువడుతున్న బూడిద, కాలుష్య నీటి కారణంగా చర్మవ్యాధికి గురైన వ్యక్తిని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి శనివారం పరామర్శించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి కంపెనీ నుంచి విడుదలవుతున్న కాలుష్య నీటిని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలను పట్టించుకోకుండా కంపెనీ యాజమాన్యం విషపూరిత నీటిని బహిరంగంగా వదలడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. రంగాయిపల్లి గ్రామానికి చెందిన రైతు ఆవు కంపెనీ కాలుష్య నీటిని తాగి మృతి చెందిందని, గ్రామంలోని పంట పొలాలు, తాగునీటి వనరులు తీవ్రంగా కలుషితమయ్యాయని ఆరోపించారు. దాదాపు రెండు వేల జనాభా ఉన్న రంగాయిపల్లి గ్రామ ప్రజలు కాలుష్యం కారణంగా చర్మవ్యాధులు, గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ వంటి తీవ్రమైన అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కంపెనీ నుంచి వెలువడుతున్న బూడిద కారణంగా చర్మ సమస్యలు పెరుగుతున్నాయని, కలుషిత నీటితో పంటలు పండక రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారని అన్నారు.కంపెనీ నుంచి విడుదలవుతున్న కాలుష్య నీటిని చింతల చెరువులోకి వదలడం వల్ల చెరువు నీరు పూర్తిగా కలుషితమై, వ్యవసాయ భూములు సాగుకు పనికిరాకుండా మారుతున్నాయని ఆరోపించారు. శబ్ద కాలుష్యం వల్ల విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నారని, స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా ఇతర రాష్ట్రాల కార్మికులతోనే కంపెనీ నడుస్తోందని విమర్శించారు.2006లో కంపెనీ ప్రారంభమైనప్పటి నుంచి జరిగిన ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు సరైన నష్టపరిహారం, బీమా సదుపాయాలు కల్పించలేదని ఆరోపించిన ఆయన, కంపెనీకి ప్రజల ప్రాణాల కంటే లాభాలే ముఖ్యమని మండిపడ్డారు.రంగాయిపల్లి, చెట్ల గౌరారం గ్రామాల ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ప్రజాభిప్రాయ సేకరణను గ్రామాల మధ్యలోనే నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. అలాగే పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, జిల్లా యంత్రాంగం కంపెనీ నుంచి వెలువడుతున్న కాలుష్యాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు."ఎంఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్ కంపెనీని వెంటనే తరలించాలి. రంగాయిపల్లి, చెట్ల గౌరవారం గ్రామాల ప్రజల ఆరోగ్యం, ప్రాణాలను కాపాడాలి.

కంపెనీ తొలగింపు వరకు ప్రజలతో కలిసి న్యాయపోరాటం కొనసాగిస్తాం" అని వంటేరు ప్రతాప్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.ఇది ప్రింట్ మీడియా శైలిలో, వార్తా కథనంగా సవరించిన కాపీ. అవసరమైతే ఇంకా ఆకర్షణీయమైన ప్రధాన శీర్షిక, ఉపశీర్షికలు మరియు బాక్స్ హైలెట్స్‌తో కూడా సిద్ధం చేసి ఇవ్వగలను.

## హామీలపై అడిగితే అరెస్ట్ చేస్తారా

**హైదరాబాద్,** తెలంగాణలో నిరుద్యోగుల సమస్యలపై, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల విఫలతపై గళమెత్తేందుకు బీఆర్ఎస్ చేపట్టిన 'యువ సంగ్రామ సదస్సు' తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. సరూర్ నగర్ స్టేడియంలో మరికాసేపట్లో ప్రారంభం కానున్న ఈ సదస్సుపై ప్రభుత్వం తొలుత ఆంక్షలు విధించింది. దీంతో, బీఆర్ఎస్ ఏకంగా హైకోర్టు మెట్లెక్కి మరీ న్యాయబద్ధంగా అనుమతి తెచ్చుకుంది. అయితే సభ ప్రారంభానికి ముందే పోలీసులు చర్యలు చేపట్టారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో పాటు బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌లను పోలీసులు వారి ఇళ్లలోనే హౌస్ అరెస్టు చేశారు.ఈ నిర్బంధంపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ తన నివాసం నుండి ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇవాళ ఉదయాన్నే పోలీసులు తనను అరెస్టు చేయడానికి ఇంటికి వచ్చారని ఆయన మండిపడ్డారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్న యువ సంగ్రామ సదస్సుకు తాను వెళ్లాల్సి ఉందని, దానికి హైకోర్టు అనుమతి కూడా ఉందని చెప్పినా పోలీసులు వినలేదన్నారు. తమకు పైనుంచి ఆదేశాలు ఉన్నాయని, మిమ్మల్ని ఎక్కడికీ పోనివ్వద్దని పోలీసులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయస్థానం పర్మిషన్ ఇచ్చినా కూడా అంబేద్కర్ రాసిన రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు.రాష్ట్రంలో కొనసాగుతున్న ఈ నిర్బంధకాండ నాడు ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ రోజులను తలపిస్తోందని ప్రవీణ్ కుమార్ దుయ్యబట్టారు. ఒకవైపు ఇలాంటి అరాచకాలకు పాల్పడుతూనే, మరోవైపు సిగ్గు లేకుండా ప్రజా పాలన అని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వద్దే హోంశాఖను పెట్టుకుని, మొదటి నుంచీ బీఆర్ఎస్ సభలకు ఆటంకాలు సృష్టిస్తూనే ఉన్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎలాంటి కుట్రలు చేసినా తాను పోలీసుల ఆంక్షలు దాటుకుని సదస్సుకు వెళ్లి తీరుతానని స్పష్టం చేశారు. ఒకవేళ తనను ఇంటి నుంచి కదలనివ్వకుండా బలవంతంగా అడ్డుకుంటే అక్కడికక్కడే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు.

## తండ్రికి అదిరిపోయే గిఫ్ట్ ఇచ్చిన కూతురు

**హైదరాబాద్** తెలంగాణకు చెందిన ఓ యువతి తన తండ్రి 50వ పుట్టినరోజున ఆయనకు ఊహించని సర్‌ప్రైజ్ ఇచ్చింది. తన కలల బండిని కళ్ల ముందు చూసిన ఆ తండ్రి ఆనందంతో ఉప్పొంగిపోయారు. భావోద్వేగాన్ని ఆపుకోలేక కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ హృద్యమైన దృశ్యాలను ఆ కూతురు వీడియో తీసి సోషల్ మీడియాలో పంచుకోగా, అది ఇప్పుడు వైరల్‌గా మారి లక్షలాది మంది హృదయాలను కదిలిస్తోంది.వివరాల్లోకి వెళితే.. నందిని కావేరి అనే యువతి తన తండ్రి పుట్టినరోజు కోసం కొన్ని వారాలుగా ఒక సర్‌ప్రైజ్ ప్లాన్ చేసింది. ఇన్నాళ్లూ తన కుటుంబం కోసమే బతికిన నాన్నకు గుర్తుండిపోయే బహుమతి ఇవ్వాలని ఆమె నిర్ణయించుకుంది. పుట్టినరోజునాడు, మొదట వీడియో కాల్‌లో నవ్వుతూ 'హ్యాపీ బర్త్‌డే డాడీ' అని శుభాకాంక్షలు చెప్పింది. ఆ తర్వాత కుటుంబ సభ్యులు ఆమె తండ్రిని ఇంటి బయటకు తీసుకువచ్చారు.

అక్కడ ఒక పెద్ద వస్త్రంతో కప్పి ఉంచిన వస్తువును చూపించారు.ఏముందా అని ఆసక్తిగా ఆ గుడ్డను తొలగించిన తండ్రికి అక్కడ కొత్త మోటార్‌సైకిల్ కనిపించింది. దాన్ని చూసి ఆనందంతో ఆయన కళ్లలో నీళ్లు తిరిగాయి. తీవ్రమైన భావోద్వేగంతో అక్కడున్న భార్య, పిల్లలను ఒక్కొక్కరిగా ఆలింగనం చేసుకున్నారు. ఆయన్ను చూసి కుటుంబ సభ్యులు కూడా కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ మధుర క్షణాలు అందరినీ కదిలించాయి.ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంటూ నందిని ఒక ఎమోషనల్ పోస్ట్ రాసింది. "మా నాన్న తన జీవితాంతం మా కుటుంబానికే ప్రాధాన్యతనిచ్చారు. మాకు అన్నీ ఇచ్చారు కానీ తన కోసం ఏనాడూ ఏమీ అడగలేదు. అందుకే నేను ప్రతీ రోజూ కష్టపడి పని చేస్తున్నాను.

ఆయన త్యాగాలకు, ప్రేమకు, నాపై ఉంచిన నమ్మకానికి ఇది ఒక చిన్న కృతజ్ఞత మాత్రమే" అని ఆమె పేర్కొంది. ఈ బహుమతి తన తండ్రి చేసిన త్యాగాలతో పోలిస్తే చాలా చిన్నదని, కానీ ఆయన మాకు ఎంత ఇష్టమో గుర్తుచేస్తుందని ఆశిస్తున్నానని తెలిపింది. ఈ సర్‌ప్రైజ్‌ను రహస్యంగా ఉంచడంలో సహాయం చేసిన తన తల్లికి, సోదరుడికి కూడా ఆమె ధన్యవాదాలు చెప్పింది.ఈ వీడియో చూసిన నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. తండ్రి కళ్లలోని కన్నీళ్లు ఆయన చేసిన ఏళ్ల త్యాగాలను, కృతజ్ఞతను ప్రతిబింబిస్తున్నాయని పలువురు కామెంట్ చేశారు. తమ తల్లిదండ్రులకు కూడా ఇలాంటి బహుమతి ఇచ్చే స్థాయికి తాము ఎదగాలని చాలామంది ఆకాంక్షించారు. తల్లిదండ్రుల నిస్వార్థ త్యాగాలకు దక్కే గుర్తింపు ఎంత విలువైనదో ఈ వీడియో గుర్తు చేస్తోందని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

## మహిళపై దాడి కేసులో సీఐపై చర్యలకు ఆదేశాలు

**గుంటూరు** మహిళపై దాడి కేసులో సీఐపై చర్యలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఫిర్యాదుపై సకాలంలో స్పందించడంలో లోపాలు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. మహిళపై దాడి ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నగరంపాలెం సీఐ సత్యనారాయణపై శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలకు ఎస్పీ వకుల్ జిందాల్ సిఫార్సు చేసారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా స్వీకరించి తక్షణ చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మహిళల భద్రత, న్యాయ పరిరక్షణకు గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ వకుల్ జిందాల్ భరోసా ఇచ్చారు.

## జిల్లా వ్యాప్తంగా పోలీసుల 'స్వచ్ఛాంధ్ర' శ్రమదానం

**మదనపల్లి** శనివారం జిల్లా వ్యాప్తంగా 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతి నెలా మూడో శనివారం ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలనే లక్ష్యంతో, ఎస్పీ కార్యాలయ ప్రాంగణం మరియు పరిసరాలను అధికారులు, సిబ్బంది శ్రమదానంతో శుభ్రం చేశారు. గడ్డపారలు, గుణపాలతో చెత్త, పిచ్చిమొక్కలను తొలగించి, చిన్న గుంతలను పూడ్చివేసి పరిసరాలను పరిశుభ్రంగా మార్చుకున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ మరియు డీఎస్పీ కార్యాలయాలలోనూ పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తమ కార్యాలయ పరిసరాలను శుభ్రం చేసుకున్నారు.

## యువతీ యువకుడు ఆత్మహత్య

**నల్గొండ** నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం మునుకుంట్లలో అనుమానాస్పద రీతిలో యువతి మృతి చెందింది. మృతురాలు లక్ష్మీ ప్రసన్న ఉరికి వేలాడుతూ కనిపించింది. ప్రసన్న మృతిపై గ్రామానికి చెందిన ఓ యువకుడిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తోన్నారు. ప్రసన్న కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేసిన యువకుడు కూడా శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. చరణ్ తాటి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇద్దరూ గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నట్లు సమాచారం. ప్రసన్నసూర్యాపేటలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతోంది. ఇద్దరి మృతి ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. .

## ప్రకాశం జిల్లాలో ఆర్టీసీ బస్సు బోల్తా

**ఒంగోలు** కామేపల్లి నుండి ఒంగోలు వెళ్లే మార్గంలో ద్వారకా సీఫుడ్స్ వద్ద ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి పల్లెవెలుగు బస్సు బోల్తా పడింది. ఘటనలో పలువురు ప్రయాణికులకు గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని కొండపి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో 60 మంది ప్రయాణికులు వున్నారు. ప్రయాణికుల్లో 20 మంది పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు కూడా ఉన్నట్లు గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ అక్కడినుంచి పరారైయాడు.

## బహదూర్ గూడలో ఉద్రిక్తత

**రంగారెడ్డి** శంషాబాద్ మండలం బహదూర్గూడలో 650 ఎకరాల స్థలం సేకరణకు వ్యతిరేకంగా శాంతియుతంగా పట్టాల కోసం రైతులు, గ్రామస్తులు నిరసనకు దిగారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. శనివారం తెల్లవారుజాము నుండి బహదూర్గూడ గ్రామంలో పోలీసులు భారీగా మోహరించారు.కోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ భూములను సర్కారు స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమయిందని గ్రామస్తులు ఆరోపించారు. నిరసనకారులను పరామర్శించడానికి వెళ్లిన బీఆర్ఎస్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసారు. నందిగామ్ పోలీసు స్టేషన్ కు తరలించారు.

# ఒక్కరోజు వెలుగులా... మళ్లీ చీకట్లో సంగమం

**సీఎం పర్యటనకే పరిమితమైన ప్రకాశం, శాశ్వత వెలుగులు ఎప్పుడు.?**

**శాఖల సమన్వయ లోపంతో చీకట్లో కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం... భక్తుల భద్రత ప్రశ్నార్థకం**



ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్) కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం... ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీక. ప్రతిరోజూ వందలాది మంది భక్తులు, వారాంతాలు, పండుగల రోజుల్లో వేలాది మంది పర్యాటకులు అడుగుపెట్టే పవిత్ర ప్రదేశం. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించిన ఈ సంగమం ప్రస్తుతం చీకట్లలో మగ్గుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన రోజున వెలుగులతో కళకళలాడిన ఘాట్, మరుసటి రోజే మళ్లీ అంధకారంలోకి జారిపోవడం అధికార యంత్రాంగం పనితీరుపై తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.
ప్రజల్లో ఇప్పుడు ఒకటే ప్రశ్న వినిపిస్తోంది.

### “వెలుగులు సీఎం పర్యటనకేనా...? భక్తులకు అవసరం లేదా?”

సీఎం పర్యటన సందర్భంగా ప్రత్యేకంగా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి, ఘాట్‌ను అందంగా తీర్చిదిద్దారు. రాత్రి వేళ మొత్తం ప్రాంతం ప్రకాశవంతంగా కనిపించింది. భక్తులు, స్థానికులు కూడా ప్రభుత్వం శాశ్వతంగా ఈ ఏర్పాట్లు కొనసాగిస్తుందని భావించారు. కానీ కార్యక్రమం ముగిసిన వెంటనే విద్యుత్ దీపాలు ఆరిపోయాయి. అప్పటి నుంచి మళ్లీ ఘాట్ మొత్తం చీకట్లోనే మునిగిపోయింది. ఇప్పుడు సాయంత్రం తర్వాత సంగమానికి వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నది ఒడ్డున మెట్లు ఎక్కడున్నాయో, దారి ఎక్కడుందో కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఆందోళనతో తిరిగి వెళు_న్నారు. పవిత్ర హారతి కార్యక్రమాల సమయంలో కూడా సరైన వెలుతురు లేకపోవడం వల్ల భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య కొత్తది కాదు. స్థానికులు ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడం లేదు. ఇటీవల ఘాట్‌ను సందర్శించిన సీఆర్డీఏ ఉన్నతాధికారి లక్ష్మీ పార్థసారధి దృష్టికి కూడా ఈ అంశాన్ని దుర్గగుడి ఈవో శీనా నాయక్ తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే ఇది తమ శాఖ పరిధిలోని అంశం కాదని సమాధానం వచ్చినట్లు తెలుస్తోంది. ఇదే అసలు సమస్యగా స్థానికులు చెబుతున్నారు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధినా? అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బాధ్యతనా? లేక మరేదైనా శాఖ పరిధినా? అనే విషయంలో స్పష్టత లేకపోవడంతో ఎవరూ ముందుకు రావడం లేదని విమర్శిస్తున్నారు. శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పరిష్కారం మాత్రం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పవిత్ర సంగమం రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందుతోంది. ప్రతి అమావాస్య, పౌర్ణమి, పుష్కర స్నానాలు, ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాలకు వేలాది మంది భక్తులు ఇక్కడికి వస్తుంటారు. అలాంటి ప్రదేశంలో కనీస విద్యుత్ సౌకర్యం లేకపోవడం బాధాకరమని పలువురు అంటున్నారు. వెలుతురు లేకపోవడం కేవలం అసౌకర్యం మాత్రమే కాదు... భద్రతా సమస్య కూడా. రాత్రివేళ మెట్లు కనిపించక జారి పడే ప్రమాదం ఉంది. నది ఒడ్డున చీకటి కారణంగా ప్రమాదవశాత్తు నీటిలో పడే అవకాశాలను కూడా కొట్టిపారేయలేమని స్థానికులు హెచ్చరిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్షణ చర్యలు చేపట్టడం కూడా కష్టమవుతుందని చెబుతున్నారు. అంతేకాదు... చీకటి ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు అనుకూలంగా మారే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబాలతో వచ్చే పర్యాటకులు రాత్రి సమయంలో అక్కడ ఎక్కువసేపు ఉండేందుకు వెనుకాడుతున్నారు. మహిళలు ఒంటరిగా రావడానికి భయపడుతున్న పరిస్థితి నెలకొంది. ఇది పర్యాటక అభివృద్ధికి ఏమాత్రం అనుకూలం కాదని స్థానిక వ్యాపారులు కూడా పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి భారీ ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతోంది. పవిత్ర సంగమాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని పలుమార్లు ప్రకటించింది. కానీ అలాంటి ప్రదేశంలో విద్యుత్ వెలుగుల వంటి కనీస మౌలిక సదుపాయాలే లేకపోవడం అభివృద్ధి ప్రకటనలకు విరుద్ధంగా ఉందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఘాట్ వద్ద విద్యుత్ దీపాలు, భద్రతా సిబ్బంది, సీసీ కెమెరాలు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, సూచిక బోర్డులు వంటి మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని స్థానికులు సూచిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా శాశ్వత వ్యవస్థ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అభివృద్ధి అంటే కేవలం వీఐపీ పర్యటనల సమయంలో తాత్కాలిక అలంకరణలు చేయడం కాదని, ప్రజలు ప్రతిరోజూ ఉపయోగించే సౌకర్యాలను శాశ్వతంగా కల్పించడమే నిజమైన అభివృద్ధి అని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. సీఎం పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు ఒక్కరోజు కోసమేనా? లేక భక్తుల కోసమా? అనే ప్రశ్న ఇప్పుడు అందరిలోనూ వినిపిస్తోంది. పవిత్ర సంగమం రాష్ట్ర గౌరవానికి ప్రతీక. అలాంటి ప్రాంతం చీకట్లో ఉండటం రాష్ట్ర ప్రతిష్ఠకు కూడా మంచిది కాదని స్థానికులు పేర్కొంటున్నారు. శాఖల మధ్య బాధ్యతలపై తర్జనభర్జనలు కొనసాగించే బదులు, సంబంధిత అధికారులు వెంటనే సమన్వయ సమావేశం నిర్వహించి శాశ్వత విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
సీఎం పర్యటన రోజున వెలిగిన దీపాలు... ఇక ప్రతిరోజూ భక్తుల దారిని ప్రకాశింపజేసే రోజులు ఎప్పుడు వస్తాయో చూడాల్సి ఉంది.

## చెట్లను పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత, గ్రామ ప్రజలకు చెట్లను పంపిణీ చేసిన

**రెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ పద్మవతి అశోక్ గౌడ్**




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) నర్సాపూర్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో శనివారం నాడు గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో రెడ్డిపల్లి గ్రామ ప్రజలకు చెట్లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా రెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు గానీ పరిసరాలలో గాని ఒకరికి ఆరు చెట్లను నాటాలని రెడ్డిపల్లి గ్రామ ప్రజలకు సూచించారు చెట్టు నాటన వలన పర్యావరణాన్ని సుస్థిరంగా ఉండడానికి దోహదపడుతుంది కావున చెట్లు నాటడం కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని రెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ తెలిపారు చెట్లను రక్షించడం వలన ఆ చెట్టును మనకు చక్కటి నీడ ఇస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ఉప సర్పంచ్ నక్క ఇందిరా, వార్డు సభ్యులు భూదేవి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన

**- మంత్రి నారా లోకేష్**

**కనకదుర్గమ్మ ప్రసాదం అందజేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాన్ని పవన్ కల్యాణ్ కి అందజేసిన లోకేష్, ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. భుజానికి అయిన గాయం, నిర్వహించిన శస్త్రచికిత్స, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వైద్యులు సూచించిన విధంగా పూర్తిస్థాయిలో విశ్రాంతి తీసుకుంటూ చికిత్సను కొనసాగించాలని సూచించారు. ఇద్దరు నేతలు కొద్దిసేపు ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. పవన్ కల్యాణ్ ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని ఆకాంక్షిస్తూ లోకేష్ ధైర్యం చెప్పారు. ఈ మర్యాదపూర్వక భేటీ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ త్వరగా కోలుకుని ప్రజాసేవలో మళ్లీ చురుకుగా పాల్గొనాలని పలువురు ప్రజాప్రతినిధులు, అభిమానులు, జనసేన–టీడీపీ శ్రేణులు ఆకాంక్షిస్తున్నాయి.

## మాదకద్రవ్యాల ముఠాలపై ఉక్కుపాదం

**గంజాయి రవాణా మార్గాలపై ప్రత్యేక నిఘా**

**అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ అభిషిక్త్ కిశోర్**



విశాఖపట్నం(ప్రశ్న న్యూస్) జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. గంజాయి రవాణా జరిగే మార్గాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, విద్యార్థులు, యువత డ్రగ్స్ బారిన పడకుండా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ (NCORD) సమావేశంలో కలెక్టర్ మాదకద్రవ్యాల నియంత్రణ చర్యలను సమీక్షించారు. ఒడిశా–విజయనగరం సరిహద్దుల నుంచి జిల్లాలోకి గంజాయి అక్రమ రవాణా జరుగుతున్న మార్గాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, చెక్‌పోస్టులు, ఇతర రవాణా మార్గాల్లో పోలీసులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్, ఆర్టీసీ శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. డ్రోన్లు, సీసీ కెమెరాలు, నైట్ విజన్ పరికరాలు, స్నిఫర్ డాగ్స్ వినియోగాన్ని మరింత విస్తరించాలని తెలిపారు. సముద్ర మార్గం ద్వారా సింథటిక్ డ్రగ్స్, కొకైన్ వంటి మాదకద్రవ్యాలు జిల్లాలోకి ప్రవేశించకుండా విశాఖపట్నం, గంగవరం పోర్టుల వద్ద కస్టమ్స్, కోస్ట్‌గార్డ్, పోర్టు, పోలీసు శాఖలు సమన్వయంతో ప్రత్యేక నిఘా కొనసాగించాలని ఆదేశించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంస్థల సహకారంతో డ్రగ్స్ అక్రమ రవాణా వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. డ్రగ్స్‌కు బానిసైన వారిని డీ–అడిక్షన్, కౌన్సెలింగ్, రీహాబిలిటేషన్ కేంద్రాలకు తరలించి పునరావాసం కల్పించాలని సూచించారు. కేజీహెచ్, గ్రీన్స్ వ్యాలీ వంటి కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సేవలను అవసరమైన వారికి చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే మద్యం దుకాణాల పరిసరాల్లో బహిరంగంగా మద్యం సేవించకుండా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 117 ఎన్డీపీఎస్ కేసులు నమోదు - 223 మంది అరెస్టుసమావేశంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ, 2026 జూన్ వరకు 117 ఎన్డీపీఎస్ కేసులు నమోదు చేసి 223 మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. 617.29 కిలోల గంజాయి, 10.83 గ్రాముల ఎండీఎంఏ, 3.2 లీటర్ల హాషిష్ ఆయిల్, మూడు ఎల్ఎస్డీ బ్లాట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డ్రగ్స్ నేరాలకు పాల్పడుతున్న వారిపై 837 డ్రగ్ ఆఫెండర్ షీట్లు తెరిచినట్లు, 26 కేసుల్లో ఆర్థిక దర్యాప్తు కొనసాగుతోందన్నారు. 'ఆపరేషన్ వజ్ర ప్రహర్'లో భాగంగా డ్రగ్స్ హాట్‌స్పాట్లలో ప్రత్యేక తనిఖీలు, కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని, నగరంలో డ్రోన్లు, సీసీ కెమెరాలు, స్నిఫర్ డాగ్స్ సహాయంతో పటిష్ఠ నిఘా కొనసాగుతోందని వివరించారు. సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు, నార్కోటిక్స్, కోస్ట్‌గార్డ్, కస్టమ్స్, పోర్టు, ఆర్టీసీ, వైద్య శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## విశ్రాంతిలోనూ శాఖల పనితీరుపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టి



పంచాయతీరాజ్, అటవీ శాఖల పురోగతిపై సమీక్ష – పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక ఆదేశాలు
హైదరాబాద్(ప్రశ్న న్యూస్) శస్త్రచికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకుంటున్నప్పటికీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు తన శాఖల పనితీరుపై నిరంతరం దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం హైదరాబాద్‌లో పంచాయతీరాజ్, అటవీ శాఖల ముఖ్య కార్యదర్శి శ్రీ కాంతిలాల్ దండేతో సమావేశమై శాఖాపరమైన అంశాలపై సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ సమీక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన పనులు వేగంగా పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్ఠం చేయడంతో పాటు, మురుగునీటి నిల్వలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రతి గ్రామానికి రక్షిత మంచినీరు నిరంతరంగా అందేలా తగిన ఏర్పాట్లు చేయాలని, ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు స్పష్టం చేశారు. శస్త్రచికిత్స అనంతరం విశ్రాంతిలో ఉన్నప్పటికీ ప్రజా సమస్యలు, శాఖల పనితీరుపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చూపుతున్న చొరవ అధికార యంత్రాంగానికి మరింత బాధ్యతను గుర్తు చేస్తోందని అధికారులు పేర్కొన్నారు.

## సహారా బాధితులకు న్యాయం ఎప్పుడు.?

**ఏళ్లుగా చిక్కుకుపోయిన డిపాజిట్లు**

**ఆర్థిక ఇబ్బందుల్లో వేలాది కుటుంబాలు**

**ప్రభుత్వాలు జోక్యం చేసుకుని త్వరితగతిన పరిష్కారం**

**చూపాలని డిపాజిటర్ల విజ్ఞప్తి**





గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) భవిష్యత్ అవసరాల కోసం జీవితకాల పొదుపులను సహారా ఇండియా వివిధ డిపాజిట్ పథకాలలో పెట్టుబడిగా పెట్టిన వేలాది మంది ఖాతాదారులు, గడువు పూర్తయి సంవత్సరాలు గడిచినా తమ సొమ్ము తిరిగి అందక తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గజ్వేల్ ఏరియా బ్రాంచ్ పరిధిలోనే కోట్ల రూపాయల విలువైన పరిపక్వత గడువు ముగిసిన డిపాజిట్లు ఇప్పటికీ చెల్లింపులకు నోచుకోలేదని బాధితులు వాపోతున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోందని వారు పేర్కొంటున్నారు. పిల్లల ఉన్నత విద్య, వివాహాలు, వైద్య చికిత్సలు, వృద్ధాప్య భద్రత వంటి అవసరాల కోసం జీవితకాల పొదుపులను సహారాలో డిపాజిట్ చేసిన కుటుంబాలు ప్రస్తుతం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, రైతులు, చిన్న వ్యాపారులు, మహిళలు, రోజువారీ కూలీలు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన అనేక మంది తమ సొమ్ము చిక్కుకుపోవడంతో అప్పులు చేసి జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితుల కథనం ప్రకారం, డిపాజిట్ గడువు పూర్తయిన తర్వాత పలుమార్లు సంబంధిత కార్యాలయాలను సంప్రదించినప్పటికీ చెల్లింపుల విషయంలో స్పష్టత లభించలేదని తెలిపారు. దీంతో ఏళ్ల తరబడి న్యాయం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. సహారా డిపాజిటర్ల సమస్య దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలను ప్రభావితం చేస్తోందని బాధితులు చెబుతున్నారు. అర్హులైన డిపాజిటర్ల వివరాలను పారదర్శకంగా పరిశీలించి, చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నారు. బాధితుల సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, సమస్య పరిష్కారం కోసం పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదన్నారు. చెల్లింపులకు సంబంధించి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి, అర్హులైన ప్రతి డిపాజిటర్‌కు త్వరితగతిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. “మా సొమ్ము మాకు తిరిగి ఇవ్వండి” అనే నినాదంతో తమ ఉద్యమాన్ని చట్టబద్ధమైన మార్గాల్లో కొనసాగిస్తామని బాధితులు స్పష్టం చేశారు. ఏళ్లుగా ఎదురుచూస్తున్న కుటుంబాల బాధను గుర్తించి, సహారా డిపాజిటర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## శ్రీశైలంలో విరామ దర్శన విధానంలో మార్పులు

**శని, ఆది, సోమవారాల్లో ఆన్‌లైన్ స్పర్శదర్శన**

**టికెట్ ఉన్నవారికే ఉదయం దర్శనం**

**సామాన్య భక్తుల సౌకర్యానికే నిర్ణయం**





శ్రీశైలం (ప్రశ్న న్యూస్) శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని
దర్శించుకునేందుకు భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో, సామాన్య భక్తులకు మరింత సులభంగా దర్శనం కల్పించేందుకు దేవస్థానం విరామ దర్శన విధానంలో కీలక మార్పులు చేసింది. ఈ మేరకు శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు సంయుక్తంగా వెల్లడించారు. కొత్త విధానం ప్రకారం శనివారం, ఆదివారం, సోమవారం ఉదయం వేళల్లో మనమిత్ర వాట్సాప్ సేవ లేదా ఆన్‌లైన్ ద్వారా ముందస్తుగా స్పర్శదర్శన టికెట్లు పొందిన భక్తులకు మాత్రమే స్పర్శదర్శనం కల్పిస్తారు. ప్రముఖులు స్వయంగా ఆలయానికి విచ్చేసిన సందర్భాల్లో మాత్రమే అవసరాన్ని బట్టి వారికి ఉదయం ప్రాధాన్యత దర్శనం కల్పించనున్నారు. అదేవిధంగా, ప్రముఖుల సిఫారసు లేఖలతో వచ్చే భక్తులకు ఉదయం స్పర్శదర్శనం ఉండదని స్పష్టం చేశారు. అలాంటి భక్తులకు అవకాశం మేరకు రాత్రి 9 గంటల తర్వాత మాత్రమే స్పర్శదర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ మార్పుల వల్ల సర్వదర్శనం (ఉచిత దర్శనం), శీఘ్ర దర్శనం, అతిశీఘ్ర దర్శనం క్యూలైన్లలో వేచి ఉండే సమయం గణనీయంగా తగ్గి, సామాన్య భక్తులు స్వామి–అమ్మవార్లను మరింత సులభంగా దర్శించుకునే అవకాశం కలుగుతుందని అధికారులు పేర్కొన్నారు. కొత్త దర్శన విధానాన్ని భక్తులు గమనించి దేవస్థానానికి సహకరించాలని ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

## ఉపాధ్యాయులకు ట్రాఫిక్, సైబర్ నేరాలపై అవగాహన

**గజ్వేల్ ఇన్స్పెక్టర్ రవికుమార్, సత్యనారాయణ**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రజ్ఞాపూర్ జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్–సర్వీస్ శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులకు శనివారం ట్రాఫిక్, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమగ్ర శిక్ష అభియాన్ కోర్స్ డైరెక్టర్ పి. అంజి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి. సత్యనారాయణ పాల్గొని రోడ్డు భద్రతా నియమాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, అతివేగం వల్ల జరిగే ప్రమాదాలు, మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. అదేవిధంగా ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ మోసాలు, బ్యాంకింగ్ మోసాలు, డిజిటల్ అరెస్ట్, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న సైబర్ నేరాల నుంచి ఎలా అప్రమత్తంగా ఉండాలో, వాటి నుంచి రక్షణ పొందేందుకు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆసక్తిగా పాల్గొని పలు సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. ప్రజల్లో ట్రాఫిక్ నియమాల పట్ల బాధ్యతాయుతమైన అవగాహనతో పాటు సైబర్ నేరాలపై అప్రమత్తత పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు సూచించారు.

# సరూర్ నగర్ యువ సంగ్రామ సదస్సులో పాల్గొన్న

## కొల్చారం మండలం బిఆర్ఎస్ పార్టీ యువజన అధ్యక్షులు సంతోష్ రావు



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) సరూర్ నగర్ లో తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో పాల్గొన్న కొల్చారం మండలం బిఆర్ఎస్ పార్టీ యువజన అధ్యక్షులు సంతోష్ రావు ఆధ్వర్యంలో శనివారం నాడు కొల్చారం మండల యువజన నాయకులు బయలుదేరారు ఈ సందర్భంగా యువజన అధ్యక్షులు సంతోష్ రావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి మరియు బిజెపి పార్టీకి తగిన గుణపాఠం యువకులే చెబుతారని వారు తెలియజేశారు ఎన్నికల సమయంలో యువకులకు ఉద్యోగాలు ఇస్తాము అని చెప్పి ఇప్పుడేమో అధికారంలోకి వచ్చి యువకులను మోసం చేస్తున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలోనే జరిగే ఎన్నికలలో తగ్గిన బుద్ధి చెప్తామని కొల్చారం మండలం బి ఆర్ ఎస్ పార్టీ యువజన అధ్యక్షులు సంతోష్ రావు తెలిపారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న తుక్కాపూర్ గ్రామ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు ఉపసర్పంచ్ ఆరే రవీందర్ కొల్చారం మండలం టిఆర్ఎస్వి అధ్యక్షులు సురేష్ గౌడ్, కొల్చారం మండలం టిఆర్ఎస్వి ఉపాధ్యక్షులు శ్రీకాంత్, కోనాపూర్ యూత్ ప్రెసిడెంట్ రాజేందర్, రంగంపేట గ్రామ యూత్ అధ్యక్షులు ఉసికి సుధాకర్ కొల్చారం మండలం గ్రామ యూత్ అధ్యక్షులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# పురాతన ,వారసత్వ సంపదకు నిలయం మెదక్ జిల్లా

## మా అధ్యక్షుడు ,విలక్షణ హాలీవుడ్ నటుడు, సినీ నిర్మాత మంచు విష్ణు
## మా అసోసియేషన్ అధ్యక్షుడు,సినీ నటుడు మంచు విష్ణుకు ఘన స్వాగతం

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) శనివారం ,మెదక్ జిల్లా లో టూరిజం అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మంచు విష్ణు ఏడుపాయలకు చేరుకోగానే అదనపు కలెక్టర్ నగేష్ మొక్క ను అందించి స్వాగతం పలికారు. ఏడుపాయల ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో మత గుడిలోకి తీసుకెళ్లరూ.సినీ నటుడు మంచు విష్ణు ఏడుపాయల వన దుర్గ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ ప్రధాన అర్చకులు శంకర్ శర్మ మరియు రాజశేఖర్ పంతులు, మురళి పంతులు, పవన్ పంతులు , అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు.ఆలయ చరిత్ర , ప్రాముఖ్యాన్ని అదనపు కలెక్టర్ నగేష్ మంచు విష్ణు కు వివరించారు. అనంతరం చారిత్రక నేపథ్యం కలిగిన మెదక్ ఖిల్లాను సందర్శించి దాని చరిత్రను జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడినుండి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మెదక్ సీఎస్ఐ కేథడ్రల్ చర్చిని సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలోమాట్లాడుతూ... పురాతన ,వారసత్వ సంపదకు నిలయం మెదక్ జిల్లా అన్నారు. మన చరిత్ర గురించి పుస్తకాల్లో చదివాం, ఎన్నో విన్నాం కానీ చూసింది చాలా తక్కువ అని సినీ నటుడు మంచు విష్ణు పేర్కొన్నారు.. మనకున్న చరిత్ర 95% ప్రపంచంలో వేరే దేశాలకు ఎవరికి లేదు అన్నారు..ఆ చరిత్రను



కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.. ఇక్కడున్న జిల్లా యంత్రాంగం మెదక్ జిల్లాలో ఉన్నటువంటి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ కూడా తయారు చేసినట్టు తెలిపారు. మెదక్ జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలతో పాటు, చారిత్రిక నేపథ్యం కలిగిన పర్యాటక ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి.. వాటిని కాపాడుకోవాలి.. హైదరాబాద్ నుంచి మెదక్ కు కూతవేటు దూరంలో ఉన్న చారిత్రక పర్యాటక ప్రాంతాన్ని



చూడకపోవడం సిగ్గుచేటు అనిపించింది అన్నారు. మన చరిత్రను మనం తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది అన్నారు .. భవిష్యత్తులో నేను నటించే సినిమాలో కానీ ప్రొడ్యూస్ చేసే సినిమాలో అయినా మెదక్ నుంచి ఒక సినిమాకు అవకాశం ఇస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం శాఖ అధికారి రమేష్,మున్సిపల్ కమిషనర్ నవీన్ ,మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్,కౌన్సిలర్లు, డి ఎస్ పి ప్రసన్న కుమార్ ,మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు .

# చిన్నారుల ఆరోగ్యమే భవిష్యత్తుకు బాట

## అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన: ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్
## పౌష్టికాహారం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి



విశాఖపట్నం(ప్రశ్న న్యూస్)చిన్నారుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు అంగన్వాడీ కేంద్రాల పాత్ర అత్యంత కీలకమని విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ఫలాలు ప్రతి అర్హ చిన్నారికి నాణ్యతతో చేరేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.శనివారం 37వ వార్డు పరిధిలోని జబ్బర్ తోట ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను ఎమ్మెల్యే కూటమి నాయకులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల ప్రాంగణంలో మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు తన వంతు సందేశం ఇచ్చారు.అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పిల్లల హాజరు పట్టిక, కేంద్ర నిర్వహణ, చిన్నారులకు అందిస్తున్న సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు. అంగన్వాడీ సిబ్బందితో మాట్లాడి పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, ఆరోగ్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి అవసరమైన పౌష్టికాహారం నాణ్యతతో అందించాలని, ఆహార పదార్థాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావు ఉండరాదని స్పష్టం చేశారు.కేంద్ర పరిసర ప్రాంతాల పరిశుభ్రతను పరిశీలించిన ఎమ్మెల్యే, చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలంటే పరిశుభ్రమైన వాతావరణం అత్యవసరమని పేర్కొన్నారు. కేంద్రాల్లో పారిశుధ్య ప్రమాణాలను ఎప్పటికప్పుడు పాటించాలని, ప్రతి సేవలో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ఈ సందర్భంగా చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని ఎమ్మెల్యే స్వయంగా రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి చిన్నారికి పూర్తిస్థాయిలో అందేలా అంగన్వాడీ సిబ్బంది మరింత బాధ్యతతో పనిచేయాలని కోరారు. ఈ తనిఖీలో సీడీపీఓ నీలిమ, కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీతో కేంద్ర సిబ్బంది మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు.

# చిన్నారుల ఆరోగ్య రక్షణకు కొత్త అధ్యాయం

## తొలిసారిగా పిల్లలకు షుగర్, బీపీ స్క్రీనింగ్ - ఆర్‌బీఎస్‌కే-2.0తో 62.65 లక్షల మందికి 38 రకాల ఉచిత ఆరోగ్య పరీక్షలు

అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో మరో కీలక ముందడుగు పడింది. చిన్న వయస్సులోనే మధుమేహం (షుగర్), అధిక రక్తపోటు (బీపీ) వంటి జీవనశైలి వ్యాధులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా ప్రత్యేక స్క్రీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టింది. జాతీయ బాల స్వాస్థ్య కార్యక్రమాన్ని (ఆర్‌బీఎస్‌కే) మరింత విస్తరించి ఆర్‌బీఎస్‌కే-2.0గా అమలు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా 62.65 లక్షల మంది చిన్నారులకు 38 రకాల సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని 20.95 లక్షల మంది (0-6 ఏళ్లు) చిన్నారులు, ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ పాఠశాలల్లో చదువుతున్న 41.70 లక్షల మంది (6-18 ఏళ్లు) విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన వారికి పూర్తిగా ఉచిత వైద్యం అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన భవిష్యత్తును నిర్మించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

### జీవనశైలి వ్యాధులపై ప్రత్యేక దృష్టి

ఇప్పటివరకు సాధారణ ఆరోగ్య పరీక్షలకే పరిమితమైన ఆర్‌బీఎస్‌కే కార్యక్రమాన్ని ఈసారి మరింత విస్తరించారు. చిన్నారుల్లో పెరుగుతున్న జీవనశైలి సమస్యలను దృష్టిలో ఉంచుకుని మధుమేహం, అధిక రక్తపోటు, థైరాయిడ్ సమస్యలు, మూత్రపిండాల వ్యాధులు, జన్యుపరమైన మూత్రనాళ లోపాలు, అధిక మొబైల్ ఫోన్ వినియోగం, నిద్ర సమస్యలు, సమగ్ర అభివృద్ధి లోపాలు వంటి ఎనిమిది కొత్త ఆరోగ్య అంశాలను తొలిసారిగా పరీక్షల పరిధిలోకి తీసుకొచ్చారు.

### నాలుగు విభాగాల్లో 38 రకాల పరీక్షలు

ఆర్‌బీఎస్‌కే-2.0 కింద పరీక్షలను జన్యుపరమైన లోపాలు, పోషకాహార లోపాలు, వ్యాధులు, అభివృద్ధి ఆలస్యాలు-వైకల్యాలు అనే నాలుగు ప్రధాన విభాగాల్లో నిర్వహించనున్నారు. జన్యుపరమైన లోపాల్లో గుండె, కంటి, చెవి, నాడీ సంబంధిత సమస్యలు, డౌన్ సిండ్రోమ్, చీలిన పెదవి, వంకర పాదం, రెటీనా వ్యాధులు, మూత్రపిండాల లోపాలను గుర్తిస్తారు. పోషకాహార విభాగంలో రక్తహీనత, విటమిన్-ఏ, విటమిన్-డి లోపాలు, పోషకాహార లోపం, ఊబకాయం, థైరాయిడ్ వాపును పరిశీలిస్తారు. వ్యాధుల విభాగంలో చర్మ, గుండె, శ్వాసకోశ, దంత సమస్యలు, మూర్ఛ, క్షయ, కుష్ఠు వ్యాధులతో పాటు షుగర్, బీపీ, మూత్రపిండాల వ్యాధులు, అధిక మొబైల్ వినియోగం వల్ల కలిగే ప్రభావాలను పరీక్షిస్తారు. అభివృద్ధి ఆలస్యాల విభాగంలో ఆటిజం, దృష్టి, వినికిడి, భాషా వికాసం, అభ్యాస లోపాలు, నిద్ర సమస్యలు, మానసిక ఎదుగుదలపై ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహిస్తారు.

### పాఠశాలలకే వైద్య బృందాలు

ప్రత్యేక వైద్య బృందాలు నేరుగా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తాయి. ఆరోగ్య సమస్యలు గుర్తించిన చిన్నారులను జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు, ప్రభుత్వ బోధనాసుపత్రులకు రిఫర్ చేసి పూర్తిగా ఉచిత వైద్యం అందిస్తారు.

### క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

మధుమేహం, బీపీ, థైరాయిడ్ వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించేలా ఏఎన్‌ఎంలు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆరోగ్య సిబ్బందికి ఇప్పటికే ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. లక్షణాల ఆధారంగా అవసరమైన వారికి రక్తంలో చక్కెర, రక్తపోటు పరీక్షలు నిర్వహించి వెంటనే వైద్య సేవలకు అనుసంధానం చేస్తారు.

### ఆరోగ్యవంతమైన బాల్యమే ప్రభుత్వ లక్ష్యం



"చిన్నారులే దేశ భవిష్యత్తు. వారి ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి ఉచిత వైద్యం అందించడం ద్వారా ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఎదిగేలా చేయడమే మా లక్ష్యం. ఆర్‌బీఎస్‌కే- 2.0 పిల్లల ఆరోగ్య సంరక్షణలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతుంది" అని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని లక్షలాది మంది చిన్నారులకు ఆరోగ్య భద్రత మరింత బలోపేతం కానుండగా, జీవనశైలి వ్యాధులను ముందుగానే గుర్తించి సమర్థవంతమైన చికిత్స అందించే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసిందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# 25 ఏళ్ల డ్రైనేజీ కష్టాలకు చెక్

## రూ.33 లక్షలతో బాలయోగి-మసీదు వీధుల అభివృద్ధికి శ్రీకారం
## 32వ డివిజన్‌లో శాశ్వత మౌలిక
## సదుపాయాలే లక్ష్యం: ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం (ప్రశ్న న్యూస్) రాజమహేంద్రవరం నగరంలోని 32వ డివిజన్‌లో గత 25 సంవత్సరాలుగా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న బాలయోగి స్ట్రీట్, మసీదు స్ట్రీట్ డ్రైనేజీ, రహదారి సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగు వేసిందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. రూ.33 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, డివిజన్ ఇన్‌చార్జి సుందరి ప్రతిపాదన మేరకు ఈ అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. బాలయోగి స్ట్రీట్‌లో సుమారు 520 మీటర్ల డ్రైనేజీ, 120 మీటర్ల సీసీ రోడ్డు, మసీదు స్ట్రీట్‌లో 540 మీటర్ల డ్రైనేజీ, 130 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. ఇరుకు వీధుల్లో డ్రెయిన్లపై నిర్మించిన మెట్లు, ఇతర ఆక్రమణల కారణంగా పారిశుద్ధ్య కార్మికులు శుభ్రపరిచే అవకాశం లేకపోవడంతో నీరు నిల్వ ఉండి దోమల సమస్యలు తీవ్రంగా మారాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన డ్రెయిన్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని, కొత్తగా నిర్మిస్తున్న డ్రైనేజీ వ్యవస్థతో మరో 20 నుంచి 25 సంవత్సరాల పాటు సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. 32వ డివిజన్‌లో ఇది ఒక్కటే కాకుండా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, అవసరమైన ప్రతి ప్రాంతంలో డ్రైనేజీ, రహదారి నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# బడి పిల్లల కళ్లకు 'నేత్రజ్యోతి'

- ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత కంటి పరీక్షలు..
అవసరమైన వారికి అద్దాల పంపిణీ
- 5 ఏళ్లు దాటిన ప్రతి చిన్నారికి వార్షిక నేత్ర పరీక్షలు తప్పనిసరి: డాక్టర్ సుధా



నెల్లూరు(ప్రశ్న న్యూస్) పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రారంభమైన 'నారాయణ నేత్ర జ్యోతి--నారాయణ దంత సురక్ష' సేవలు ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలకూ విస్తరించాయి. ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి అద్దాలను అందించే కార్యక్రమానికి శనివారం నెల్లూరులోని వి.ఆర్. మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ వేదికగా శ్రీకారం చుట్టారు.నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ దాతృత్వంతో నారాయణ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ నిర్వహిస్తున్న ఈ ఉచిత వైద్య సేవలు ఇప్పటికే వేలాది మందికి చేరువయ్యాయి. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ షఫీ, విఆర్‌సీ ప్రధానోపాధ్యాయులు వెంకట్రావు, కో-క్లస్టర్ డాక్టర్ పోకల రవి, 44వ డివిజన్ ఇన్‌చార్జి దర్శి హరికృష్ణ, డివిజన్ అధ్యక్షుడు గుడి ఏడుకొండలు, ఆదిత్య సాయి, మహేష్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్ బోడాపై చర్యలు తీసుకోవాలని జనసేన ఫిర్యాదు

- మంగళగిరి పట్టణ పోలీసులకు వినతిపత్రం..
కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని డిమాండ్



మంగళగిరి(ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్, ఆయన కుటుంబ సభ్యులపై సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపిస్తూ రాజ్ బోడాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నాయకులు మంగళగిరి పట్టణ పోలీసులను కోరారు. జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మంగళగిరి-తాడేపల్లి నగర అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతి, యువజన విభాగం నాయకుడు చిట్టెం అవినాష్ తదితరులు శనివారం పట్టణ సీఐ వీరాస్వామికి ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు.ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, రాజ్ బోడా యూట్యూబ్ సహా సోషల్ మీడియా వేదికలలో పవన్ కళ్యాణ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని, మత విశ్వాసాలను కించపరిచేలా వీడియోలు పోస్టు చేశారని ఆరోపించారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇతర రాజకీయ నాయకులపై కూడా అసభ్యకర వ్యాఖ్యలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ఉప ముఖ్యమంత్రి పట్ల ఇటువంటి వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని జనసేన నాయకులు పేర్కొన్నారు. సామాజిక, మత విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యవహరించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసులను కోరారు.ఈ కార్యక్రమంలో శివాలయం ట్రస్ట్ బోర్డు సభ్యుడు తిరుమలశెట్టి మురళీకృష్ణ, లక్ష్మీనరసింహస్వామి ట్రస్ట్ బోర్డు సభ్యుడు బళ్ళా ఉమామహేశ్వరరావు తదితర జనసేన నాయకులు పాల్గొన్నారు.

# ‘తీర్థరూప తాండేయవారిగే’ మూవీ రివ్యూ!



టీవీ సీరియల్స్ హీరోగా గుర్తింపు తెచ్చుకున్న కొంతమంది, ఆ తరువాత వెండితెరపై కూడా హీరోలుగా అవకాశాలను .. అభిమానులను సంపాదించుకున్నారు. అలాంటి కథానాయకుల జాబితాలో ‘నిహార్ ముఖేశ్’ కూడా చేరిపోయాడు. తెలుగులో ‘గుప్పెడంత మనసు’ సీరియల్ లో ‘రిషి’ పాత్ర ద్వారా పేరు తెచ్చుకున్న కన్నడ నటుడు ముఖేశ్, ‘తీర్థరూప తాండేయ వారిగే’ సినిమా ద్వారా, వెండితెరకి పరిచయమయ్యాడు. ‘అమెజాన్ ప్రైమ్’లో తెలుగులోను ఈ సినిమా అందుబాటులో ఉంది.పృథ్వీ (నిహార్ ముఖేశ్) ఓ ట్రావెల్ వ్లాగర్. మిడిల్ క్లాస్ కుటుంబానికి చెందిన యువకుడు. తల్లితో కలిసి నివసిస్తూ ఉంటాడు. అందమైన .. అనుభూతి ప్రధానమైన ప్రదేశాలకు వెళుతూ, అందుకు సంబంధించిన వీడియోలను పోస్ట్ చేస్తూ ఉంటాడు. జనంలో అతనంటే మంచి క్రేజ్ ఉంటుంది. అయితే అతనికి మాత్రం జీవితం చాలా వెలితిగా ఉంటుంది. అందుకు కారణం, తన చిన్నతనంలోనే తండ్రి శివ శంకర్ (రవీంద్ర విజయ్) ఇల్లొదిలి వెళ్లిపోవడం. ఎక్కడ ఉన్నాడో ఏమైపోయాడో తెలియకపోవడం.తండ్రిలేని కారణంగా స్కూల్ ఏజ్ మొదలు, కాలేజ్ వరకూ పృథ్వీ ఎన్నో అవమానాలను ఎదుర్కొంటాడు. ఇప్పుడు కూడా ‘వాక్ మేన్’ అతని ఫ్రెండ్స్ అతనిని ఆ విషయంపై హేళనగా మాట్లాడుతూ ఉంటారు. తన తండ్రి ఎందుకు ఇల్లొదిలి వెళ్లిపోయాడనేది అతని ముందున్న పెద్ద ప్రశ్న. ఆయన ఎక్కడ ఉన్నా వెతికి తీసుకురావాలనే ఒక పట్టుదల అతనిలో బలంగా ఉంటాయి. తన తల్లి జానకి (సితార) విశ్వనాథ్ (రాజేశ్ నటరంగ)తో సన్నిహితంగా ఉండటం పృథ్వీకి ఎంతమాత్రం ఇష్టం ఉండదు. తండ్రి ఇల్లొదిలి వెళ్లిపోవడానికి తల్లి ప్రవర్తనయే కారణమని అతను భావిస్తుంటాడు. అందువలన ఆమెతో ముభావంగా ఉంటాడు. అతని ధోరణి జానకిని ఎంతో బాధిస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలోనే అతనికి అక్షర (రచన ఇందర్)తో పరిచయమవుతుంది. అది కాస్తా ప్రేమగా మారుతుంది. ఆమె తండ్రి సీనియర్ జర్నలిస్ట్ రవి రామనాథపుర అని తెలుసుకుని పృథ్వీ షాక్ అవుతాడు. తమ ప్రేమ ఫలించడం కష్టమనే నిర్ధారణకు వస్తాడు.ఒకరోజున రవి రామనాథపుర హఠాత్తుగా చనిపోతాడు. తన కోసం ఆయన రాసి పెట్టిన లెటర్ ను అక్షర చదువుతుంది. అప్పుడు ఆమెకి ఒక చేదు నిజం తెలుస్తుంది. అదేమిటి? పృథ్వీ తండ్రి శివశంకర్ కనిపించకుండా పోవడానికీ, రవి రామనాథపురకి మధ్య గల సంబంధం ఏమిటి? వాళ్లిద్దరికీ సంబంధించిన గతంలో ఏం జరుగుతుంది? అది తెలుసుకున్న అక్షర ఏం చేస్తుంది? తన తండ్రి జాడ తెలుసుకోవాలనే పృథ్వీ కోరిక నెరవేరుతుందా? అనేది మిగతా కథ.ప్రతి ఒక్కరి జీవితంలోను తల్లి – తండ్రి ప్రధానమైన పాత్రలను పోషిస్తారు. ఇద్దరిలో ఎవరు లేకపోయినా, అది మరెవరూ భర్తీ చేయలేని ఒక వెలితిగానే ఉంటుంది. పూర్తి ఆనందాన్ని .. సంతోషాన్ని అందకుండా చేస్తుంది. అలా చిన్నతనంలోనే తండ్రి ప్రేమకి దూరమైన హీరో, అందుకు కారణం తల్లి అనుకుని ఆమెకి తాను దూరంగా మసలుకుంటూ ఉంటాడు. అదే ఆలోచన కారణంగా మనసిచ్చిన అమ్మాయిని కూడా దూరం పెట్టాలని నిర్ణయించుకుంటాడు. చివరికి అతనికి తెలిసే నిజం ఏమిటి? అనే ఆసక్తికరమైన అంశం చుట్టూ ఈ కథను అల్లుకుంటూ వెళ్లారు.తన తండ్రిని జాడ తెలుసుకోవడానికి ఆరాటపడుతున్న పృథ్వీకి, అక్షర సాయపడాలనుకుంటుంది. అయితే అసలు పృథ్వీ తండ్రి కనిపించకుండా పోవడానికి కారకుడు తన తండ్రి రవి రామనాథపురనే అనే విషయం అక్షరకి తెలియడం ఈ కథలో మరో కీలకమైన అంశంగా కనిపిస్తుంది. ఇక్కడి నుంచి కథ కాస్త ఊపందుకుంటుంది. అది క్లైమాక్స్ వరకూ అలాగే కొనసాగుతూ వెళుతుంది. క్లైమాక్స్ ట్విస్ట్ కూడా చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. అయితే ఈ కథ చాలా నిదానంగా మొదలవుతుంది. ఫస్టాఫ్ అంతా కూడా చాలా నింపాదిగా సాగుతుంది. హీరోకి తండ్రిలేడనే అసంతృప్తి .. తల్లి పట్ల అసహనం ఉన్నాయనే విషయాన్ని దర్శకుడు సాగదీస్తూ వెళ్లాడు. లవ్ ట్రాక్ అందుబాటులో ఉన్నా పెద్దగా వాడుకోలేదు. ఆ ట్రాక్ కి కాస్త రొమాన్స్ ను జోడించినా, నీరసానికి నిమ్మరసం దొరికినట్టుగా ఉండేది. ఇక హీరో ఎదుగుదలను ఓర్చలేని గ్యాంగ్ ను కూడా కాస్త హైలైట్ చేస్తే బాగుండేది.దీపక్ ఫొటోగ్రఫీ బాగుంది. మేఘాలయ వంటి లొకేషన్స్ ను తెరపై ఆవిష్కరించిన తీరు గొప్పగా ఉంది. జో కోస్టా బాణీలు .. నేపథ్య సంగీతం ఫరవాలేదు. పాటలకి సంబందించినంత వరకూ సాహిత్యాన్ని గురించి గానీ .. పాడించడం గురించిగాని ఎంతమాత్రం పట్టించుకోలేదనే విషయం అర్థమవుతుంది. కంటెంట్ లో ఎక్కువ ఇబ్బంది పెట్టిన అంశం ఇదే. నిజానికి ఈ కథలో మంచి పాయింట్ ఉంది. అయితే పాయింట్ వరకూ వెళ్లడానికి తీసుకున్న సమయం ఎక్కువ. అక్కడివరకూ ఆసక్తికరమైన సన్నివేశాలను డిజైన్ చేయకుండా, నాన్చుతూ నిదానంగా నడిపించడం లోపంగా కనిపిస్తుంది. టోటల్ గా చూసుకుంటే ఓ మాదిరి కంటెంట్ గానే ఇది మిగిలిపోతుందని చెప్పచ్చు.

## రివ్యూలు మిక్స్‌డ్, కలెక్షన్లు

# మాత్రం సూపర్ హిట్

### – రూ.100 కోట్ల క్లబ్‌లోకి ‘ధమాల్ 4’




బాలీవుడ్ స్టార్ హీరో అజయ్ దేవగణ్ నటించిన తాజా కామెడీ ఎంటర్‌టైనర్ ‘ధమాల్ 4’ బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. విమర్శకుల నుంచి ఆశించిన స్థాయిలో ప్రశంసలు రాకపోయినా, ప్రేక్షకుల నుంచి మాత్రం సినిమాకు మంచి ఆదరణ లభిస్తోంది. అదే కలెక్షన్ల రూపంలో స్పష్టంగా కనిపిస్తోంది. బాక్సాఫీస్ దగ్గర రెండో శుక్రవారం కూడా ఈ సినిమా నిలడగా వసూళ్లు సాధించింది. దీంతో భారత్‌లో రూ.100 కోట్ల నెట్ కలెక్షన్ల మైలురాయిని విజయవంతంగా అందుకుంది. రెండో శుక్రవారం వసూళ్లలో పెద్దగా తగ్గుదల లేకపోవడం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వీకెండ్‌లో ఈ సినిమా మరింత భారీ వసూళ్లు సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవలి కాలంలో విడుదలైన పలువురు బాలీవుడ్ స్టార్ హీరోల చిత్రాలు త్వరగా బాక్సాఫీస్ వద్ద జోరు కోల్పోయినా, ‘ధమాల్ 4’ మాత్రం అలాంటి పరిస్థితిని ఎదుర్కొనడం లేదు. ముఖ్యంగా ‘స్పైడర్–మ్యాన్: బ్రాండ్ న్యూ డే’ విడుదలయ్యే వరకు పెద్ద పోటీ లేకపోవడంతో ఈ సినిమాకు బాక్సాఫీస్ వద్ద మంచి అవకాశం లభించనుంది. ప్రముఖ దర్శకుడు ఇంద్ర కుమార్ తెరకెక్కించిన ఈ చిత్రంలో అజయ్ దేవగణ్‌తో పాటు అర్షద్ వార్సీ, రితేష్ దేశ్‌ముఖ్, అంజలి ఆనంద్, సంజీదా షేక్, సంజయ్ మిశ్రా, రవి కిషన్ కీలక పాత్రల్లో నటించారు. కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్ ప్రధాన బలంగా తెరకెక్కిన ఈ చిత్రం ఫ్యామిలీ ఆడియన్స్‌ను విశేషంగా ఆకట్టుకుంటూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది.

### పెద్ది తర్వాత కొత్త సినిమాకు

# జాన్వీకపూర్ గ్రీన్ సిగ్నల్.. !

దేవర సినిమాతో టాలీవుడ్‌కు గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది బాలీవుడ్ భామ జాన్వీకపూర్. ఈ చిత్రం జాన్వీకపూర్ కు ఆశించిన స్థాయిలో బ్రేక్ ఇవ్వలేకపోయింది. రీసెంట్‌గా రాంచరణ్‌తో కలిసి నటించిన పెద్ది బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. అయితే ఈ మూవీ కూడా జాన్వీకపూర్‌కు అంతగా కలిసి రాలేదు. పెద్దిలో జాన్వీకపూర్‌కు సంబంధించిన కొన్ని సన్నివేశాలపై తీవ్రస్థాయిలో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. భవిష్యత్‌లో ఇలాంటి పాత్రలు చేయొద్దంటూ పలువురు నెటిజన్లు జాన్వీకపూర్‌కు సూచించారు.అయితే జాన్వీకపూర్ నెక్స్ట్ ఎలాంటి ప్రాజెక్టు చేయబోతుందా..? అని ఆసక్తిగా చర్చించుకుంటున్నఅభిమానులు, మూవీ లవర్స్ కోసం క్రేజీ న్యూస్ నెట్టింట వైరల్ అవుతోంది.ఉమేశ్ బిస్ట్ డైరెక్టర్‌తో కొత్త సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది జాన్వీకపూర్. బాలాజీ మోషన్ పిక్చర్స్, సిఖ్యా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై ఏక్తాకపూర్, గునీత్ మోంగా ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ మూవీ వచ్చే అక్టోబర్–నవంబర్‌లో సెట్స్‌పైకి వెళ్లనుంది. మరి ఉమేశ్ బిస్ట్ జాన్వీకపూర్ కోసం ఎలాంటి పాత్రను డిజైన్ చేశాడు. ఈ సినిమాతో అయినా జాన్వీకపూర్‌కు బ్రేక్ వస్తుందా..? అనేది తెలియాల్సి ఉంది.



# ఇంగ్లీష్ రాదని ఆటపట్టించేవారు!

తన పాఠశాల రోజుల గురించి కథానాయిక భాగ్యశ్రీ బోర్సే ఆసక్తికరమైన విషయాల్ని పంచుకుంది. ఇంగ్లిష్ రాకపోవడంతో అందరూ తనను ఆటపట్టించేవారని, నాటి అవమానాలను సవాలుగా తీసుకొని చదువుల్లో రాణించానని చెప్పుకొచ్చింది. ఇటీవల ఓ కాలేజీ విద్యార్థులతో జరిపిన ముఖాముఖిలో ఆమె ఈ సంగతుల్ని వెల్లడించింది. ‘మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో నా బాల్యం గడిచింది. అక్కడే మరాఠీ మీడియం స్కూల్‌లో చదువుకున్నా. కొన్నాళ్ల తర్వాత నాన్న ఉద్యోగరీత్యా మా కుటుంబమంతా నైజీరియాకు షిఫ్ట్ అయ్యాం. అక్కడ ఇంగ్లిష్ మీడియం కావడంతో ఇబ్బందులు మొదలయ్యాయి. నాకేమో మరాఠీ, హిందీ తప్ప మరో భాష తెలియదు. ఇంగ్లిష్ రాదని స్కూల్లో అందరూ హేళన చేసేవారు. జోక్స్ వేస్తూ ఆటపట్టించేవారు. అయినా నేను ఏ మాత్రం కుంగిపోలేదు. అవహేళనలను ఛాలెంజ్‌గా స్వీకరించా. కొద్దిరోజుల్లోనే ఇంగ్లిష్‌పై పట్టుసాధించాను. ఆ తర్వాత కొన్నాళ్లకు ఇంగ్లీష్‌లో అనర్గళంగా ప్రసంగించే స్థాయికి చేరుకున్నా. పాజిటివ్ మైండ్‌సెట్‌తో ఉంటే ఎలాంటి సవాళ్లనైనా అధిగమించవొచ్చని నా స్కూల్ డేస్‌లోనే అర్థమైంది’ అని చెప్పింది భాగ్యశ్రీ బోర్సే. ఇటీవలే ఈ భామ ‘లెనిన్’ సినిమాతో కెరీర్‌లో తొలి విజయాన్ని అందుకుంది.




# ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో?



‘కేజీఎఫ్’తో రాత్రికి రాత్రి పాన్ ఇండియా స్టార్‌గా అవతరించారు కన్నడ స్టార్ హీరో యశ్. ‘హను–మాన్’ విజయంతో యావత్ భారతీయ సినిమా దృష్టినే ఆకర్షించారు దర్శకుడు ప్రశాంత్‌వర్మ. ప్రస్తుతం ‘టాక్సిక్’, ‘రామాయణ’ చిత్రాలతో యశ్ బిజీగా ఉంటే, రిషబ్‌శెట్టితో పాన్ ఇనిండియా స్థాయిలో ‘జై హనుమాన్’ని తెరకెక్కిస్తూ ఆడియన్స్‌లో ఆసక్తిని పెంచుతున్నారు ప్రశాంత్‌వర్మ. తాజాగా వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా అంటూ ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. ఇటీవలే తన తదుపరి ప్రాజెక్ట్ కోసం యశ్‌ని సంప్రదించారట ప్రశాంత్‌వర్మ. ఈ వార్త నిజమే అయితే.. ఆ సినిమా సౌతిండియన్ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లడం ఖాయమని సినీపండితులు అభిప్రాయపడుతున్నారు. ప్రశాంత్‌వర్మ సినిమాలంటే ఫాంటసీ, మైథలాజికల్ అంశాల మేళవింపుగా ఉంటాయి. మరి యశ్ కోసం ఆయన ఏ తరహా కథను తయారు చేశారో చూడాలి. ప్రస్తుతం వీరిద్దరి మధ్య కథాచర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయట.

# మోస్ట్ వాంటెడ్ ‘ఫౌజీ’

ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ చిత్రం ‘ఫౌజీ’ విడుదల తేదీ ఖరారైంది. ఈ సినిమాను డిసెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు గురువారం మేకర్స్ ప్రకటించారు. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ పీరియాడిక్ డ్రామాలో ప్రభాస్ సైనికుడి పాత్రలో కనిపించనున్నారు. 1940 దశకం నాటి స్వాతంత్ర్య సంగ్రామం, రెండో ప్రపంచయుద్ధం తాలూకు సంఘటనల నేపథ్యంలో అల్లుకున్న కల్పిత కథ ఇదని సమాచారం. రిలీజ్ డేట్ పోస్టర్‌లో ప్రభాస్ కదనరంగంలో క్షతగాత్రుడై రక్తమోడుతున్న దుస్తుల్లో కనిపిస్తున్నారు. బందూక్ చేపట్టి దీర్ఘాలోచనలో ఉన్న ఆయన లుక్ సినిమాలోని భావోద్వేగాల్ని ప్రతిఫలిస్తున్నది ఓ యోధుడి త్యాగం, ధీరత్వానికి ప్రతీకలా ఈ లుక్ కనిపిస్తున్నది. ‘1932 నుంచి మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు’ అని రాసి ఉన్న స్టాంప్ కూడా కథపై ఆసక్తిని రేకెత్తిస్తున్నది. భారీ స్థాయిలో యాక్షన్ ఘట్టాలతో పాటు బలమైన భావోద్వేగాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని మేకర్స్ తెలిపారు. ఇమాన్వి, మిథున్‌చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, జయప్రద, భానుచందర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, నిర్మాణం: మైత్రీ మూవీ మేకర్స్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, భూషణ్ కుమార్, రచన–దర్శకత్వం: హను రాఘవపూడి



# కమనీయంగా కళ్యాణం



ఖాన్ దురాని, సాహితి ఆవంచ జంటగా నటించిన లవ్ డ్రామా ‘కళ్యాణం కమనీయం జీవితం’. రవి లోకిరెడ్డి దర్శకుడు. పైలా ప్రసాద్‌రావు, కిశోర్ గుండాల కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం నిర్మాణం పూర్తి చేసుకుని త్వరలో విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. వీఎన్ ఆదిత్య, రామ్‌ప్రసాద్, మల్లిడి సత్యనారాయణరెడ్డి, జెమినీ సురేశ్ ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ఈ సినిమా ద్వారా యువ నటీనటులు చాలామంది పరిచయం కానున్నారని, ప్లజెంట్‌గా సాగుతూనే చివరిలో ఒక మంచి ట్విస్ట్‌తో సినిమా ఆకట్టుకుంటుందని కథానాయిక సాహితి అవంచ తెలిపారు. హీరోగా అవకాశం కల్పించిన దర్శక, నిర్మాతలకు హీరో ఖాన్ దురాని కృతజ్ఞతలు తెలిపారు. ‘నా జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలకు ఫిక్షన్‌ని జోడించి ఈ చిత్రాన్ని రూపొందించాను. ఇందులోని సస్పెన్స్ ఎలిమెంట్స్ ఆకట్టుకుంటాయి’ అని దర్శకుడు చెప్పారు. ఇంకా నిర్మాత కిశోర్ గుండాల, మ్యూజిక్ డైరెక్టర్ శ్రీమురళీ కార్తికేయ కూడా మాట్లాడారు.

# శేషాచలాన్ని మేల్కొలిపే దివ్యనాదం

## – తిరుమల సుప్రభాత సేవ, భక్తిని మేల్కొలిపే శ్రీవేంకటేశుని తొలి నిత్యకైంకర్యం



వైఖానస ఆగమ సంప్రదాయం... శతాబ్దాల చరిత్ర... ప్రతివాది భయంకర అన్నన్ రచించిన దివ్య సుప్రభాతం... శ్రీవారి మేల్కొలుపులో దాగిన ఆధ్యాత్మిక సందేశం భారతదేశంలోని అనేక దేవాలయాల్లో నిత్యపూజలు జరుగుతుంటాయి. కానీ ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులను ప్రతి రోజూ ఒకే సమయంలో ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తే సేవ ఏదైనా ఉందంటే అది తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సుప్రభాత సేవ. తెల్లవారుజామున శేషాచల శిఖరాలపై విరిసే తొలి వెలుగుకన్నా ముందే, శ్రీవారి ఆలయంలో మార్మోగే “కౌసల్యా సుప్రజా రామా...” అనే దివ్య శ్లోకం కేవలం స్వామివారిని మేల్కొలిపేదే కాదు... ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల హృదయాల్లో భక్తి దీపాన్ని వెలిగిస్తుంది. తిరుమలలో ప్రతి రోజు సుప్రభాత సేవతోనే ప్రారంభమవుతుంది. ఈ సేవ ముగిసిన



తర్వాతే తోమాలసేవ, అర్చన, నైవేద్యం, సర్వదర్శనం వంటి అన్ని కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అందుకే సుప్రభాత సేవను తిరుమల నిత్యకైంకర్యాల్లో అత్యంత పవిత్రమైన తొలి సేవగా భావిస్తారు.

### సుప్రభాత సేవ ఎప్పుడు జరుగుతుంది.?

తిరుమల ఆలయంలో రాత్రి ఏకాంతసేవ అనంతరం ఆలయం మూసివేయబడుతుంది. మరుసటి రోజు తెల్లవారుజామున సుమారు ఉదయం 2.30 నుంచి 3 గంటల మధ్య ఆలయ అంతర్గత ఏర్పాట్లు ప్రారంభమవుతాయి. అర్చకులు, జీయర్ స్వాములు, అధికారులు తమ నియమానుసారంగా ఆలయంలో ప్రవేశిస్తారు. అనంతరం సుమారు ఉదయం 3.30 గంటలకు సుప్రభాత సేవ ప్రారంభమవుతుంది. గర్భగుడి ముందు నిలబడి అర్చకులు, వేదపండితులు శ్రీవేంకటేశ సుప్రభాతాన్ని గానం చేస్తారు. ఈ సమయంలో ఆలయంలో అపూర్వమైన నిశ్శబ్దం నెలకొని ఉంటుంది. ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వినిపించే సుప్రభాత గానం భక్తులకు దివ్యానుభూతిని కలిగిస్తుంది.

### సుప్రభాతం రచించిన మహనీయుడు..

తిరుమలలో నేడు ఆలపిస్తున్న శ్రీవేంకటేశ సుప్రభాతంను 15వ శతాబ్దానికి చెందిన విశిష్ట శ్రీవైష్ణవ పండితుడు ప్రతివాది భయంకర అన్నన్ రచించారు. ఆయన శ్రీమనవాళ మామునుల శిష్యుడు. శ్రీవారి మహిమను ప్రపంచానికి చాటాలనే సంకల్పంతో ఈ దివ్యరచనను సమర్పించారు.

### ఈ గ్రంథం నాలుగు భాగాలుగా విభజించబడింది

– సుప్రభాతం -- 29 శ్లోకాలు – స్తోత్రం -- 11 శ్లోకాలు – ప్రపత్తి -- 16 శ్లోకాలు – మంగళాశాసనం -- 14 శ్లోకాలు మొత్తం 70 శ్లోకాల ఈ దివ్యరచన నేటికీ ప్రతి రోజూ తిరుమలలో ఆలపించబడుతోంది.

**“కౌసల్యా సుప్రజా రామ...” ఎందుకు.?**

సుప్రభాతం మొదటి శ్లోకం శ్రీరాముడిని ఉద్దేశించి విశ్వామిత్రుడు పలికిన మాటలతో ప్రారంభమవుతుంది.

**“కౌసల్యా సుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే..”**

ఈ శ్లోకం ద్వారా దైవాన్ని మేల్కొలపడం అంటే ధర్మాన్ని మేల్కొలపడం అనే గొప్ప భావన వ్యక్తమవుతుంది. అనంతరం శ్రీ వేంకటేశ్వరుని మహిమను కీర్తిస్తూ వరుసగా శ్లోకాలు సాగుతాయి.

### వైఖానస ఆగమ సంప్రదాయంలో ప్రత్యేక స్థానం

తిరుమల ఆలయంలో జరిగే ప్రతి సేవ వైఖానస ఆగమ విధానానుసారమే నిర్వహించబడుతుంది. సుప్రభాత సేవ కూడా అదే సంప్రదాయంలో భాగం. ఆగమ శాస్త్రాల ప్రకారం దేవాలయంలో ప్రతిష్ఠించిన మూర్తిని రాజాధిరాజుగా భావిస్తారు. రాజును ఎలా మేల్కొలుపుతారో, అలాగే భగవంతుడిని కూడా



శాస్త్రోక్తంగా మేల్కొలపాలని ఆగమాలు నిర్దేశించాయి. అందుకే సుప్రభాత సేవలో ఎలాంటి హడావుడి ఉండదు. ప్రతి క్షణం, ప్రతి శ్లోకం, ప్రతి చర్యకు ఆగమ శాస్త్రంలో ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది.

### సుప్రభాత సేవ ఎలా జరుగుతుంది.?

అర్ధరాత్రి ఏకాంతసేవ అనంతరం శ్రీవారు విశ్రాంతి తీసుకున్నట్లు భావిస్తారు.

### ఉదయం

- ఆలయ అంతర్గత ద్వారాలు తెరుస్తారు.
- అర్చకులు, జీయర్ స్వాములు గర్భాలయం వద్దకు చేరుకుంటారు.
- శాస్త్రోక్తంగా దీపాలను సిద్ధం చేస్తారు.
- అనంతరం సుప్రభాత శ్లోకాల గానం ప్రారంభమవుతుంది.
- స్వామివారిని మేల్కొలిపిన తరువాత అంతర్గత పూజలు నిర్వహిస్తారు.
- తరువాత తోమాలసేవ, అర్చన, నైవేద్యం జరుగుతాయి.

### ఇది శతాబ్దాలుగా ఎలాంటి మార్పులు లేకుండా కొనసాగుతున్న సంప్రదాయం.


భక్తులకు లభించే అపూర్వ అవకాశం సుప్రభాత సేవను ప్రత్యక్షంగా దర్శించడం ప్రతి భక్తుడి జీవితకాల కోరికగా భావిస్తారు. ఈ సేవకు పరిమిత సంఖ్యలో మాత్రమే భక్తులకు ప్రవేశం ఉంటుంది. టిటిడి ముందస్తుగా టికెట్లు కేటాయిస్తుంది. సుప్రభాత సేవలో పాల్గొన్న భక్తులు చెప్పే అనుభూతి ఒక్కటే.. “ఆ సమయంలో ప్రపంచమే మరిచిపోతాం.. శ్రీవారి సమక్షంలో నిలబడి సుప్రభాతం వినడం జన్మ ధన్యమైందనే భావన కలిగిస్తుంది.” సుప్రభాతం వెనుక ఆధ్యాత్మిక సందేశం దేవుడు నిద్రపోడు... ఆయనను ఎందుకు మేల్కొలుపుతారు.? అనే సందేహం చాలామందికి వస్తుంది. ఆధ్యాత్మికవేత్తల వివరణ ప్రకారం..సుప్రభాతం నిజానికి స్వామివారిని కాదు, మనలోని దైవచైతన్యాన్ని మేల్కొలిపే ప్రక్రియ. మనసులోని అలసత్వం, అజ్ఞానం, అహంకారాన్ని తొలగించి ధర్మమార్గంలో నడవాలని ఈ సేవ సందేశం ఇస్తుంది.

### సంగీత ప్రపంచానికీ సుప్రభాతం వరం..

శ్రీవేంకటేశ సుప్రభాతం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఇళ్లలో ప్రతిరోజూ వినిపిస్తోంది. ముఖ్యంగా ప్రముఖ గాయని ఎం.ఎస్.



సుబ్బులక్ష్మి ఆలపించిన సుప్రభాతం ప్రపంచవ్యాప్తంగా తిరుమల భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించింది. అనేక భాషల్లో దీని భావానువాదాలు వచ్చినప్పటికీ, సంస్కృతంలో ఆలపించే అసలు సుప్రభాతానికే ప్రత్యేక ఆదరణ ఉంది.



### భక్తి... శాస్త్రం... సంప్రదాయం కలయిక

తిరుమలలో జరిగే ప్రతి సేవకు ఒక ఆధ్యాత్మిక పరమార్థం ఉంటుంది. అయితే సుప్రభాత సేవలో భక్తి, సంగీతం, వేదం, ఆగమం, సంప్రదాయం అన్నీ ఒకే చోట కలుస్తాయి. ఇది కేవలం శ్రీవారి నిత్యకైంకర్యం మాత్రమే కాదు... కోట్లాది మంది భక్తుల దినచర్యకు ఆధ్యాత్మిక ఆరంభం.

### శేషాచలంపై ప్రతిరోజూ పునరావృతమయ్యే దివ్య ఉదయం..

ప్రపంచం నిద్రలో ఉండగానే శేషాచలంపై భక్తి మేల్కొంటుంది. పక్షులు కూతలు మొదలుపెట్టకముందే, సూర్యుడు ఉదయించకముందే, గాలి సైతం నిశ్శబ్దంగా నిలిచిన ఆ వేళ... శ్రీవారి ఆలయంలో మార్మోగే సుప్రభాత గానం శతాబ్దాలుగా భక్తి సంప్రదాయాన్ని కొనసాగిస్తోంది.

ఆ స్వరాల్లో వేదం ఉంది... ఆ పదాల్లో పరమార్థం ఉంది... ఆ సేవలో శరణాగతి ఉంది... ఆ అనుభూతిలో వైకుంఠానందం ఉంది.

అందుకే తిరుమల సుప్రభాత సేవను ఒక్కసారి ప్రత్యక్షంగా దర్శించిన భక్తుడు, అది జీవితంలో పొందిన అత్యంత పవిత్రమైన అనుభవాల్లో ఒకటిగా భావిస్తాడు. శ్రీవారి కృపతో ప్రారంభమయ్యే ప్రతి ఉదయం, భక్తుని జీవితాన్నీ ఆశీర్వాదాలతో నింపుతుందనే విశ్వాసమే ఈ దివ్యసేవకు శాశ్వత మహిమ.

## రైతులను ఆత్మహత్యల వైపు నెట్టేస్తున్న

# కాంగ్రెస్ ప్రభుత్వం: జూబేర్ పాషా



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** రాష్ట్రంలో రైతుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతులను ఆత్మహత్యల వైపు నెట్టేలా పాలన సాగుతోందని బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు జూబేర్ పాషా ఆరోపించారు. గజ్వేల్ పట్టణంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో తగినంత వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయని, ఈ పరిస్థితుల్లో ప్రాజెక్టుల ద్వారా సాగునీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. రైతుల కష్టాలను పట్టించుకోకుండా ప్రతిపక్షాలపై కక్షసాధింపు రాజకీయాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. వర్షాకాలం ప్రారంభమై నెలలు గడిచినా ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో నాటిన విత్తనాలు మొలకెత్తకపోవడం, మొలకెత్తిన పంటలు కూడా నీటి కొరతతో ఎండిపోవడం వల్ల రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇలాంటి సమయంలో రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి బీడు భూములకు సాగునీరు అందించారని గుర్తు చేశారు. జిల్లాలో రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టులు ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రాజెక్టుల ద్వారా సాగునీటిని విడుదల చేయాలని, గజ్వేల్ నియోజకవర్గంలోని అసంపూర్తిగా ఉన్న కాలువల నిర్మాణాలకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రైతులు ఉద్యమానికి దిగే పరిస్థితి రాకముందే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేదంటే రైతులతో కలిసి పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

## ముక్కులో చాక్ పీస్ పెట్టుకున్న

# చిన్నారి తప్పిన ప్రమాదం




**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని నూతన్‌కల్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని అపాయం తప్పింది. ఆటల మధ్య 1 వ తరగతి విద్యార్థి చాక్ పీస్ ను ముక్కులో పెట్టుకోగా చాకచక్యంగా చిన్నారి ముక్కులో ఇరుక్కున్న చాక్ పీస్‌ను తొలగించిన 108 సిబ్బంది. దీంతో చిన్నారి క్షేమంగా బయట పడింది. 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది. మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని నూతన్‌కల్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని ఆటల మధ్య చాక్ పీస్‌ను ముక్కులో పెట్టుకుంది. దీనిని గమనించిన ఉపాధ్యాయులు మాజీ ఎస్ఎంసీ చైర్మన్‌కు సమాచారం ఇవ్వగా, వెంటనే 108 అంబులెన్స్‌కు కాల్ చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న 108 ఈఎంటీ యాదమ్మ, పైలట్ తిరుపతి చాకచక్యంగా చిన్నారి ముక్కులో ఇరుక్కున్న చాక్ పీస్‌ను తొలగించారు. దీంతో చిన్నారి క్షేమంగా బయటపడగా, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# క్యాప్రికన్ బ్లెండర్స్ కంపెనీ మేనేజర్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

## – సిఐటియు మేడ్చల్ మండల కార్యదర్శి నరేష్ పై దాడి



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ ఇండస్ట్రియల్ లో ఉన్న క్యాప్రికన్ బ్లెండర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజర్ పై మేడ్చల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. ఆయనతోపాటు మరో 4 గురిపై కేసు నమోదు అయింది. క్యాప్రికన్ బ్లెండర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ లో పనిచేస్తున్న ఇద్దరు కార్మికులు రోహిత్, గోపి కొట్టుకున్న కేసులో ఈ ఇద్దరినీ కంప్రమైస్ చేయడానికి సిఐటియు మేడ్చల్ మండల కార్యదర్శి ఎం .నరేష్ ని పిలిపించి ఆయనపై 10మందితో దాడిచేయించిన కంపెనీ మేనేజర్ నాగ ఆంజనేయులు (నాని) ప్రవీణ్, గోపి, ప్రసాద్, హేమంత్ లపైన మేడ్చల్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయిందని సీఐటీయూ మేడ్చల్ మండల కార్యదర్శి ఎం .నరేష్ తెలిపారు.. గత 2నెలల క్రితం క్యాప్రికన్ బ్లెండర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పని చేస్తున్న ముగ్గురు మహిళ కార్మికులను నిర్దాక్షణంగా తీసివేస్తే వారికీ మద్దతుగా నిలబడి వారిని పనిలో పెట్టుకోవాలని మేనేజర్ ను డిమాండ్ చేయడం వల్ల వారిని పనిలోకి తీసుకున్నారని ఈ సందర్భంలో కంపెనీ మేనేజర్ నాగ ఆంజనేయులు కక్ష పెంచుకొని అవకాశం కోసం ఎదురుచూసి దొరికిన అవకాశాన్ని ఉపయోగించుకొని సిఐటియు మండల కార్యదర్శి నరేష్ పై దాడి చేయించారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులు పేర్కొన్నారు.

## అక్రమ కట్టడాలు అంటూ 2 గంటలు ఆపారు...

# మళ్లీ మొదలుపెట్టారు

- మేడ్చల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద అక్రమ రూముల వ్యవహారం
- ఈ వ్యవహారంపై పలు అనుమానాలు
- సమగ్ర విచారణ జరిపించాలి అంటూ డిమాండ్లు



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న రూముల నిర్మాణం పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇంతకాలం అద్దె భవనంలో ఉన్న మేడ్చల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఇటీవల జెడ్పి కార్యాలయం లోకి తరలి వెళ్ళింది. దీంతో డాక్యుమెంట్ రైటర్ల కోసం పుట్ట గొడుగుల్లా రూములను ఏర్పాటు చేశారు. ఇందులో కొన్నిటికి అనుమతులు ఉండగా మరికొన్నిటికి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు సాగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఇటీవల ఈ ప్రాంతాన్ని సందర్శించిన టౌన్ ప్లానింగ్ అధికారి పుట్టగొడుగుల్లా వెలిసిన రూముల నిర్మాణాలను చూసి అవ్వాక్కయ్యారు. అనుమతులు లేని రూములకు లకు నోటీసులు ఇవ్వాలి అంటూ కిందిస్థాయి సిబ్బందిని ఆదేశించారు.

### ఆ 4 రూముల పనులను ఆపి.. మళ్లీ మొదలు పెట్టారు..

మేడ్చల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద కొత్తగా నిర్మిస్తున్న 4 రూముల నిర్మాణ పనులను రెండు గంటలపాటు ఆపించి.. మళ్లీ నిర్మాణ పనులను కొనసాగించారు అనుమతులు లేవని ఆపించి మళ్లీ నిర్మాణ పనుల కొనసాగింపు ఎలా చేస్తారు. అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### గుండ్ల పోచంపల్లి లో అక్రమ కట్టడాలకు నోటీసులు..

గుండ్ల పోచంపల్లి లో అక్రమ కట్టడాలకు టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు ఇచ్చారు. గుండ్ల పోచంపల్లి లోని మినీ ట్యాంక్ బాండ్ వద్ద 132 సర్వేనెంబర్ లో చేపడుతున్న అక్రమ నిర్మాణానికి నోటీసులు ఇచ్చారు.

## సాకేత్ ప్రణామమ్ లో సైబర్ మోసాలపై అవగాహన సదస్సు



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** గుండ్ల పోచంపల్లి డివిజన్ గౌడవల్లిలోని సాకేత్ ప్రణామమ్ వెల్‌నెస్ హబ్‌లో శనివారం నివాసితుల కొరకు ప్రత్యేక “సైబర్ ఫ్రాడ్ అవేర్నెస్ (సైబర్ మోసాలపై అవగాహన) సదస్సు విజయవంతంగా నిర్వహించారు. ఐసీఐసీఐ బ్యాంక్ సాకేత్ భూసత్వ బ్రాంచ్ సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వెంకట్ రెడ్డి హాజరై, ప్రస్తుత రోజుల్లో విస్తరిస్తున్న సైబర్ నేరాల పట్ల నివాసితులను అప్రమత్తం చేశారు. డిజిటల్ రంగంలో సాధారణంగా జరిగే వివిధ రకాల ఆర్థిక మోసాలను, వాటి బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ఒక ప్రత్యేక వీడియో చిత్రం (డాక్యుమెంటరీ) ద్వారా ఆయన నివాసితులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా ఐసీఐసీఐ బ్యాంక్ సిబ్బంది దివ్యనాయుడు, శ్రీహాస, మహేశ్‌లు మొబైల్ బ్యాంకింగ్ యాప్‌ను సురక్షితంగా ఉపయోగించే విధానాన్ని ప్రదర్శించి చూపించారు. అనంతరం జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో సాకేత్ ప్రణామమ్ నివాసితులు డిజిటల్ లావాదేవీలపై తమకున్న పలు సందేహాలను అడిగి, బ్యాంక్ అధికారుల నుండి సమాధానాలు తెలుసుకున్నారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగి శేషసాయి పర్యవేక్షించగా.. సాకేత్ ప్రణామమ్ రెసిడెన్షియల్ సొసైటీ కార్యదర్శి వల్లభేంద్ర రెడ్డి, జాయింట్ సెక్రటరీ ప్రసాదరావు నివాసితులకు ఎంతో ఉపయోగకరమైన ఈ సదస్సును నిర్వహించినందుకు బ్యాంక్ మేనేజర్ వెంకట్ రెడ్డికి, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు . ఈ అవగాహన సదస్సులో సీనియర్ సిటిజన్లు శ్రీరంగారావు, రామకృష్ణరాజు, కుమారస్వామి, ఇందిరాదేవి , ఏ, బీ, సీ బ్లాకులకు చెందిన నివాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బోయిన్ పల్లి మార్కెట్‌లో "గ్యాంగ్ వార్"







- మార్కెట్ లో మద్యం, గంజాయి మత్తులో డిష్యుం డిష్యుం
- రెండు వర్గాల మధ్య బర్త్ డే గొడవలే కారణం అంటున్న మార్కెట్ వర్గాలు.
- లోల్లిల మధ్య దందా వదిలి కొట్లాటలు.అడ్డం వస్తే అంతే సంగతులంటూ వార్నింగ్‌లు
- అధికారుల నిర్లక్ష్యానికి బోయిన్ పల్లి మార్కెట్ "పంచాయతీ వేదికలవుతున్నాయి
- యార్డుకు వచ్చి కూరగాయలు విక్రయించి వెనుతిరగాల్సిన కమీషన్ ఏజెంట్లు,మార్కెట్‌కి సంబంధం లేని వ్యక్తులతో భేటీ అవుతూ,గొడవలకు కేంద్ర బిందువుగా మారుతున్నారు
- తిరుమల గిరి పోలీసులకు సవాల్ గా మారిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్
- ట్రేడర్స్,ఖరీదు దారులు ఉండాల్సిన చోట, అసాంఘిక శక్తులు మకాం వేస్తూ శాంతి భద్రతలకు భంగం కల్పిస్తున్నారు
- పేరు గాంచిన మార్కెట్‌కి కోట్ల రూపాయలు రాబడి, యార్డ్ కి తూట్లు పోడుస్తున్న వర్తకులు
- అసలు కారణం అధికారులదే,వ్యవసాయ మార్కెటింగ్ చట్టం ప్రకారం
- కేటాయించిన షాపులు క్రయవిక్రయాలు ఉండకూడదు.వీటిని ప్రోత్సహిస్తుంది మార్కెట్ ఆఫీసర్స్ రే
- బోయిన్ పల్లి మార్కెట్ లో కమీషన్ ఏజెంట్ల సంఖ్య ఎంత.? ఉన్నది ఎంతా.? వీరిపై అధికారుల నజర్ ఏది.? అందరూ కలిసి పోయారా.? ఉండాల్సిన వారి కన్నా, సంబంధం లేని వారి సంఖ్య ఎక్కువగా ఉందని విశ్వసనీయ సమాచారం. వీళ్లతోనే ఆదాయ వేనుకేసుకుంటుంది ఎవరు.?
- వర్షాలు పడక అన్నదాతలు కన్నీళ్లతో సాగు చేస్తుంటే, దళారులు రైతు వేదికల్లో కల్లోలం సృష్టిస్తున్నారు దేశంలో రైతు చట్టాలు, సంఘాలు ఎన్ని ఉన్నా, మార్కెట్ యార్డులో జరుగుతున్న తతంగంపై గళం విప్పారు
- అన్ని అనార్థాలకు కారణం అసోసియేషన్ అధ్యక్షుడే, కనీస అవగాహన లేని వ్యక్తి ఆ అర్హతకు సరిపోరని మార్కెట్ వర్గాలు గుసగుసలు

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) పస్ఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ పరిస్థితుల పూర్తి స్థాయిలో తారు మారు అయ్యాయి.ఎల్నినో ప్రభావం పస్ఫిక్ మహాసముద్రం నడిబొడ్డున ఏర్పడడంతో సముద్ర జలాల్లో వేడి తారాస్థాయికి చేరింది.దీంతో ప్రధానంగా భారతదేశం పై ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు వాతవరణ నిపుణులు చెబుతున్నారు.వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు ఎల్నినో ప్రభావం పెరిగే అవకాశం వాతవరణ హెచ్చరికలు జారీ చేశారు.జున్ రెండో వారంలోనే నైరుతి రుతుపవనాలు కేరళను తాకినప్పుటికి ఇప్పటికీ తెలుగు రాష్ట్రాల్లో లోటు వర్ష పాతం నమోదు అవ్వడం మూలంగా ఒకవైపు రైతాంగం, మరోవైపు భారీ పరిశ్రమలు పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని భారత వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.ఈనేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో అన్నాదాతల పరిస్థితులు దయనీయంగా మారాయి.ఇది కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే గాక దేశంలోనే ఈ పరిస్థితులు నెలకోన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో "197"మార్కెట్ యార్డులో ఒకటైన బోయిన్ పల్లి మార్కెట్ పరిస్థితి భిన్నంగా ఉంది..డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు జారీ చేసిన లైసెన్స్ లు "175". కానీ కమీషన్ ఏజెంట్లు అసలు కన్న నకిలీ ఎక్కువగా ఉన్న విషయం అందరికి తెలిసిందే.కానీ ఉన్నత అధికారులు,యార్డ్ అధికారులు చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. వారి నిర్లక్ష్యానికి ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే భవిష్యత్తు మరింతగా భయభ్రాంతులకు గురయ్యే అవకాశం లేకపోలేదు. పార్టన్నర్ షిప్ చట్టాన్ని అడ్డం పెట్టుకొని కొనుగోలు చేసిన వ్యక్తి గాక మరో ఇద్దరు,ముగ్గురు వ్యాపార లావాదేవీలు నిర్వహిన్తున్నారు. మార్కెట్ అధికారులకి సంబంధం లేకుండా షాపుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తి చేస్తున్నారు.ఈ విధంగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో సుమారు నాలుగు వందల మంది కూరగాయల వ్యాపారం చేస్తున్నారంటే మామూలు విషయం కాదు.వీటి పై ఫోకస్ చేస్తూ "షోకాజ్"తో సరిపెడుతున్నారు.

## సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్..

బోయిన్ పల్లి మార్కెట్ లో సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ 1978 లో ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ మోండా మార్కెట్ గా ఉన్నప్పుడు గౌరవప్రదంగా ఉండేది.కానీ 2001 డిసెంబర్ 20 న బోయిన్ పల్లి మార్కెట్‌గా నామకరణం చేసిన తర్వాత కేటాయించిన వారు మాత్రమే (వర్తకులు) వ్యాపార లావాదేవీలు నిర్వహించేవారు.కానీ 2012 నుంచి ఎవరి పుణ్యమో కానీ (అటు అధికారుల,ఇటు కమీషన్ ఏజెంట్ల దళారుల ) తెలియదు ఒక్కోక్క దుకాణం నాలుగు ముక్కలు చేసి మార్కెట్ రూపు రేఖలనే మార్చేశారు. ఇంత తతంగం జరుగుతున్నప్పటికీ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు చోద్యం చూస్తున్నారు.యార్డు అధికారులు మాత్రం "షోకాజ్ నోటీసులు"తో సరి పెడుతున్నారు.ఈ క్రయ విక్రయాల లోల్లీ వ్యవసాయ డైరెక్టర్ చోరవ తీసుకుంటే గాని ఓ కొలిక్కి రాదని మార్కెట్ వర్గాలు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.మరో విషయం ఏమిటంటే సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి ఏడు పదులు దాటడమే కాకుండా అపార అనుభవం ఉన్న మేధావి.

కానీ గత కొంత కాలంగా అవగాహన రాహిత్యంగ ప్రవర్తిస్తున్నారని పలువురు వాపోతున్నారు.అన్నిట్లో మేధావి అయిన వ్యక్తి అయిన కాడికి,కాని కాడికి పోతూ మార్కెట్ పరువూ ప్రతిష్ఠలకు భంగం కల్పిస్తున్నారని బోయిన్ పల్లి మార్కెట్ కమీషన్ ఏజెంట్లు మనస్థాపానికి గురై తున్నారు.ఇప్పటికైనా వెళ్లే దారి మంచో చెడో తెలుసుకుంటే మంచిది, లేకపోతే పదిమందిలో చౌకగా మారుతారని మరికొందరు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.


## బోయిన్ పల్లి మార్కెట్ - సెక్రటరీ,అసోసియేషన్ అధ్యక్షుడికి హెచ్చరిక..

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్‌లో కేవలం కూరగాయల వ్యాపారం చేయాలి గానీ సంబరాలకి,తయ్ తక్కలాటలకి కేంద్రం కాదని సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి ని హెచ్చరించారు.గత అమావాస్య రోజున మార్కెట్ యార్డులో ప్యాడ్ బ్యాండ్ ఎవరి అనుమతితో లోపలికి వచ్చిందని నిలదీశారు.అదిగాక సంబంధం లేని వ్యక్తులతో కలిసి డ్యాన్స్ లు వేయడం సరికాదని సూచించారు.మార్కెట్ యార్డులో ఏమైనా జరిగితే ఎవరు బాధ్యులు అని మార్కెట్ సెక్రటరీ ఈ.వేంకటేశం ప్రశ్నించారు.ఇది పునరావృతం అయితే కేసులు తప్పవన్నారు.అలాగే తప్పు అయిందని అనడం కాదండీ,తప్పు చేసే ముందు తెలుసుకోవాలి అంతేగానీ ఇప్పుడు క్షమాపణలు కొరడమేందని అన్నారు.

# పిర్జాదిగూడ కేంద్రంగా కల్తీ పన్నీర్, చీజ్ దందా.?


- పాల పౌడర్, పామాయిల్, డాల్డాతో నకిలీ పాల ఉత్పత్తుల తయారీ.?
- గ్రేటర్‌లో విచ్చలవిడిగా కల్తీ పన్నీర్, చీజ్ విక్రయాలు అధికారుల పర్యవేక్షణ ఎక్కడ.?
- కల్తీ ఆహార మాఫియాపై పీడీ యాక్ట్ ఎందుకు అమలు చేయరని ప్రజల ప్రశ్న

( ఆర్ కె -- ప్రశ్న న్యూస్ బ్యూరో)











గ్రేటర్ హైదరాబాద్‌లో కల్తీ పాల ఉత్పత్తుల మాఫియా రోజురోజుకూ రెచ్చిపోతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పిర్జాదిగూడ కేంద్రంగా కొందరు అక్రమార్కులు పాల పౌడర్, పామాయిల్, డాల్డా, ఇతర పదార్థాలు ఉపయోగించి నకిలీ పన్నీర్, చీజ్ తయారు చేసి నగరంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కల్తీ ఆహార ఉత్పత్తులతో ప్రజలు విచిత్రమైన రోగాలతోపాటు భయంకరమైన రోగాలకు గురై తమ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. రాయదుర్గం, సుచిత్ర, సికింద్రాబాద్ మహంకాళి ఆలయం పరిసరాలు, కుషాయిగూడ, మౌలాలి, ఈసీఐఎల్ హౌసింగ్ బోర్డ్, నాగారం తదితర ప్రాంతాల్లో ఈ ఉత్పత్తులు విస్తృతంగా విక్రయిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కేవలం పన్నీర్, చీజ్ మాత్రమే కాదు, పామాయిల్, డాల్డా, రవ్వ, ఫుడ్ కలర్ వంటి పదార్థాలతో నకిలీ నెయ్యి కూడా తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ఈ ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.కల్తీ ఆహార పదార్థాల తయారీ కేంద్రాలపై తరచూ తనిఖీలు నిర్వహించాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఎక్కడ ఉన్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఖైరతాబాద్ జోన్ పరిధిలో ఉన్న ఫుడ్ ఇన్స్పెక్టర్ కనీసం ఫోన్ కూడా ఎత్తరని ఇక ఆ అధికారి ఏ పాటి విధులు నిర్వహిస్తున్నారో ఉన్నతాధికారులకె తెలియాలి. అప్పుడప్పుడు దాడులు చేసి చిన్నచిన్న కేసులు నమోదు చేయడం తప్ప, అసలు సూత్రధారులను పట్టుకునే చర్యలు కనిపించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. తూతూ మంత్రంగా కేసులు నమోదు చేసి అక్రమార్కులకు ఊరట కల్పిస్తున్నారా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.కల్తీ ఆహారం తయారు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వారిపై సాధారణ కేసులు కాకుండా కఠిన చర్యలు తీసుకొని వారిపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద కేసులు వేసి చర్యలు తీసుకుంటేనే ఈ మాఫియాకు అడ్డుకట్ట పడుతుందని సామాన్య ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే రోజురోజుకూ ఈ అక్రమ వ్యాపారం మరింత విస్తరించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అనేక ప్రాంతాల్లో కల్తీ పాల ఉత్పత్తుల తయారీ, విక్రయాలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నప్పటికీ సంబంధిత విభాగాల అధికారుల స్పందన లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జీహెచ్ఎంసీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ఫుడ్ సేఫ్టీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నారా.? లేక కార్యాలయాలకే పరిమితమయ్యారా.? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.ఇలాంటి అక్రమ దందాలకు కొందరు స్థానిక నాయకులు, మరికొందరు తమను తాము జర్నలిస్టులుగా చెప్పుకునే వ్యక్తులు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి డబ్బు కోసం కల్తీ మాఫియాకు సహకరించడం అత్యంత బాధ్యతారాహిత్యమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా ప్రభుత్వం, ఫుడ్ సేఫ్టీ శాఖ, జీహెచ్ఎంసీ అధికారులు సమగ్ర తనిఖీలు నిర్వహించి, అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# 2027 నాటికి పోలవరం పూర్తి

## - గుడివాడ సభలో చంద్రబాబు కీలక ప్రకటన



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి వంద శాతం పూర్తి చేసి తీరుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా గుడివాడలో పర్యటించిన ఆయన, అక్కడ జరిగిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' బహిరంగ సభలో మాట్లాడుతూ పోలవరం నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం అత్యంత శరవేగంగా ముందుకు తీసుకెళుతోందని ప్రకటించారు. గతంలో తాము కేవలం 12 నెలల రికార్డు కాలంలోనే పట్టిసీమ ప్రాజెక్టును పూర్తి చేసి కృష్ణా డెల్టాకు నీళ్లిచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రంలోని నదులన్నింటినీ అనుసంధానం చేయడం ద్వారా ఏపీలో కరవు అనే మాటే లేకుండా చేస్తామని భరోసా ఇచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుపై స్పందిస్తూ ఈ నెల నుంచే రాష్ట్రంలో 'తల్లికి వందనం' పథకాన్ని ప్రారంభించబోతున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. కృష్ణా జిల్లాకు ఎంతో ఘనమైన చారిత్రాత్మక నేపథ్యం ఉందని కొనియాడిన ముఖ్యమంత్రి, అభివృద్ధిలోనూ ఈ ప్రాంతాన్ని ముందంజలో ఉంచుతామన్నారు. కేవలం ప్రాజెక్టులే కాకుండా నగరాలు, గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణతో పాటు 'చెత్త నుంచి సంపద సృష్టి' చేయడమే తమ కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.

# అహ్మదాబాద్ బాణసంచా యూనిట్‌లో భారీ పేలుడు

## - 9 మంది మృతి.. ప్రధాని దిగ్భ్రాంతి



అహ్మదాబాద్ (ప్రశ్న న్యూస్) గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో శనివారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అక్రమంగా నిర్వహిస్తున్నట్లు భావిస్తున్న బాణసంచా తయారీ యూనిట్‌లో భారీ పేలుడు సంభవించి మంటలు చెలరేగడంతో 9 మంది మృతి చెందారు. పలువురు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళితే, రామోల్ ప్రాంతంలోని మెహమూద్‌పురాలో ఓ ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన బాణసంచా తయారీ కేంద్రంలో శనివారం మధ్యాహ్నం ఈ దుర్ఘటన జరిగింది. పేలుడు జరిగిన వెంటనే 9 మందిని ఎల్.జి. ఆసుపత్రికి తరలించగా, వారిలో నలుగురు అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్ర గాయాలతో చేరిన ఐదుగురిలో చికిత్స పొందుతూ మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. 95 శాతం కాలిన గాయాలతో వీరు మరణించినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. మరో ఆరుగురిని అసర్వా సివిల్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ ఒకరు మరణించారు. పేలుడు శబ్దం వినిపించిన వెంటనే సమీపంలోని రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. అహ్మదాబాద్ మేయర్ హితేష్ బారోట్, ఇతర ఉన్నతాధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. పేలుడుకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చేస్తాం

## - ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని వ్యాఖ్య



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో గుడిసెలు అనేవే లేకుండా చేస్తామని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత పక్కా ఇల్లు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని ఆయన కొనియాడారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో రూ.184.15 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న రోడ్ల అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పరిగి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు కీలక వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు లేని పేద ప్రజలు సొంతంగా పక్కా ఇంటిని నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని కోమటిరెడ్డి తెలిపారు. త్వరలోనే అర్హులైన మిగతా వారందరికీ ఇళ్లు ఇచ్చేందుకు రెండో విడత కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. వికారాబాద్ జిల్లాలో రోడ్ల నెట్‌వర్క్ బలోపేతం కోసం రూ.900 కోట్ల నిధులు మంజూరు చేయించామని, అందులో నుంచే పరిగి నియోజకవర్గానికి రూ.184.15 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రవాణా వ్యవస్థ మెరుగైతేనే పరిశ్రమలు వచ్చి స్థానిక యువతకు ఉపాధి పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి తీరుతామని మాట ఇచ్చిన మంత్రి కోమటిరెడ్డి నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులతో పాటు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాలను విజయవంతంగా కొనసాగిస్తున్నామని వివరించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588